ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 8 జూన్ 2025



ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

అనకాపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. మే 12 నుంచి 20వ తేదీ వరకు జరిగిన పరీక్షలకు జిల్లా నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులు 3,462 మంది హాజరయ్యారు. వీరిలో 1,673 మంది (48.32 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరలో 3,274 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 2,108 మంది (64.38 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ప్రథమ సంవత్సరంలో 48.32 శాతం

ద్వితీయ సంవత్సరంలో 64.38 శాతం ఉత్తీర్ణత

కేజీబీవీలకు అదనపు వసతులు

జిల్లాలోని 20 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో వివిధ పనులకు రూ.7.74 కోట్లు మంజూరు

- నిర్మాణంలో డిజిటల్ లైబ్రరీలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ గదులు
- తుది దశకు చేరిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు



కె.కోటపాడు మండలం గొల్లలపాలెంలోని కేజీబీవీ ప్రాంగణంలో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో(కేజీబీవీ) అదనపు వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలోని 20 కేజీబీవీల్లో వివిధ పనులు చేపట్టేందుకు రూ.7.74 కోట్లు మంజూరు చేసింది. దీంతో నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా జిల్లాలో 17 కేజీబీవీల్లో డిజిటల్ కంప్యూటర్ తరగతి గదులు నిర్మాణంలో ఉన్నాయి. 11 చోట్ల డిజిటల్ గ్రంథాలయ గదులు, 2 చోట్ల ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ గదుల నిర్మాణ పనులు చేపడుతున్నారు. 20 కేజీబీవీల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు, అవసరమైన చోట ప్రహరీ గోడల నిర్మాణ పనులు చేపడుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న కంప్యూటర్ గదులు, డిజిటల్ లైబ్రరీల్లో అధునాతన కంప్యూటర్లను అందుబాటులో ఉంచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ గదుల్లో విద్యార్థులకు చదువుతో పాటు వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



కేజీబీవీలకు పంపిణీ చేస్తున్న వంట పాత్రలు

తుది దశలో నిర్మాణ పనులు

జిల్లాలో ఇప్పటికే ప్రారంభించిన 53 నిర్మాణ పనులకు రూ.7.74 కోట్లు మంజూరు కాగా, రూ.4.29 కోట్ల వ్యయంతో 26 పనులను పూర్తి చేశారు. అయితే కె.కోటపాడు మండలంలోని ఒక కేజీబీవీ ప్రహరీ గోడ నిర్మాణ పనులు ప్రారంభించలేదు. మిగిలిన నిర్మాణ పనులన్నీ వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. కేజీబీవీల్లో మరుగుదొడ్లు, సైన్స్ ల్యాబ్స్, ఆర్వో ప్లాంట్‌ల ఏర్పాటు, డిజిటల్ క్లాస్‌రూమ్‌ల కోసం అదనపు గదుల నిర్మాణాలు, మరమ్మతులు, నీటి సరఫరా, విద్యుత్, తాగునీటి వసతులు కల్పిస్తున్నారు. ఆయా పనులు వేగవంతంగా జరుగుతున్నాయని జిల్లా సమగ్ర శిక్షా అధికారులు తెలిపారు.

వంట పాత్రల పంపిణీ

జిల్లాలో అన్ని కేజీబీవీలకు ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అధునాతన వంట పాత్రలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే కేజీబీవీలకు వీటిని పంపిణీ చేస్తున్నారు. స్టీల్ స్టౌవ్‌లు, వంట పాత్రలు, వెట్ గ్రైండర్లు, ఫ్రీజ్‌లు, ఇనుప బీరువాలు, మిక్సీలు అందజేస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కేజీబీవీల్లో వంట సామగ్రి పంపిణీ చేయకపోవడంతో సిబ్బంది వంట చేసేందుకు ఇబ్బందులు పడేవారు. అటువంటి ఇబ్బందులు లేకుండా ఈ ఏడాది కేజీబీవీలకు వంట పరికరాలు, పాత్రలు అందజేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

- మసీదులు, ఈద్‌గాల వద్ద ప్రత్యేక నమాజ్‌లు



జిల్లాలో శనివారం బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్‌గాల వద్ద ప్రత్యేక నమాజ్‌లు చేశారు. పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- వార్త లోపలి పేజీల్లో..

రాంబిల్లి మండలం గోవిందపాలెంలో ఆలింగం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న బాలురు



ఎలమంచిలిలో ఈద్‌గా వద్ద నమాజ్ చేస్తున్న దృశ్యం

వర్షంతో ఊరట

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికం

ఆ తరువాత మోస్తరు వర్షం

- చల్లబడిన వాతావరణం



కృష్ణాదేవిపేటలో వర్షం

అనకాపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో భిన్న వాతావరణం నెలకొంది. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఆ తరువాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

రావికమతం మండలంలో మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. మాడుగుల మండలంలో కూడా మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా, సాయంత్రం తేలికపాటి జల్లులు పడ్డాయి. గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. నక్కపల్లి మండలంలో సాయంత్రం 4 గంటలకు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతకు అల్లాడిన జనం వర్షంతో ఊరట చెందారు. అచ్యుతాపురం మండలంలో కూడా సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. నర్సీపట్నం, చోడవరం, ఎస్.రాయవరం, సబ్బవరం, మాకవరపాలెం, పాయకరావుపేట, కశింకోట మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వాతావరణం చల్లబడి, పలుచోట్ల వర్షాలు కురవడంతో జిల్లా ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.

అనకాపల్లిలో ఈదురుగాలులు



అనకాపల్లిలో చెరువును తలపిస్తున్న ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ

అనకాపల్లి టౌన్: అనకాపల్లిలో శనివారం మధ్యాహ్నం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. 34.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. మధ్యాహ్నం వరకు 36.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతతో ఉన్న వాతావరణం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశమంతా కారుమేఘాలు కమ్ముకున్నాయి. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సుమారు 45 నిమిషాల పాటు ఈదురుగాలులతో వర్షం కురియడంతో అప్పటి వరకు అత్యధిక ఉష్ణోగ్రతతో ఇబ్బందులు పడ్డ జనం ఉపశమనం పొందారు. కారణంగా రహదారుల్లో ఎక్కడపడితే అక్కడ వర్షపు నీరు నిలిచిపోయింది. రోడ్డుకు పల్లంగా ఉన్న ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపించేలా వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో డిపోలోకి వెళ్లి వచ్చే కార్మికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. అలాగే విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోవడంతో అనకాపల్లి - చోడవరం మార్గాల మధ్య రాకపోకలు సాగించే వాహనచోదకులు అవస్థలు పడ్డారు. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు కొంత సేపు అంతరాయం ఏర్పడింది.

వీడని చెత్త డంపింగ్ యార్డు కష్టాలు

చోడవరం ఊరి మధ్యలో ఉండడంతో అవస్థలు

- తరలించాలని స్థానికుల నిరసనలు
- స్థలం ఇవ్వడానికి పరిసర పంచాయతీలు ససేమిరా

చోడవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం స్థానిక మేజర్ పంచాయతీలో చెత్త డంపింగ్ యార్డు తరలింపు అధికారులకు సంకటంగా మారింది. ఒక పక్క నివాసాల మధ్యన చెత్త డంపింగ్ యార్డుతో నానా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు నిరసనలు తెలుపుతున్నారు. మరో వైపు చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటుకు ససేమిరా అంటూ పరిసర పంచాయతీలు అభ్యంతరం చెబుతున్నాయి. 20 వేల మందికి పైగా జనాభా ఉన్న స్థానిక మేజర్ పంచాయతీలో సరైన చెత్త డంపింగ్ యార్డు లేదు. చీడికాడ రోడ్డులో ఉన్న శ్మశానవాటిక స్థలంలోనే పంచాయతీ సిబ్బంది చెత్త పోస్తూ వచ్చారు. కాలక్రమంలో అదే చెత్త డంపింగ్ యార్డుగా మారింది. జనాభా తక్కువగా ఉన్నప్పుడు పెద్ద సమస్యగా కనిపించని ఈ చెత్త డంపింగ్ యార్డు, పట్టణంలో జనాభా పెరిగిపోయి రెట్టింపు స్థాయిలో చెత్త పోగుపడుతుండడం, వాటిని సిబ్బంది తగులబెడుతుండడం, ఆ పొగ పరిసర కాలనీలను ముంచెత్తుతుండడంతో ఈ చెత్త డంపింగ్ యార్డును ఇక్కడ నుంచి తొలగించాలంటూ స్థానికులు పట్టుబడుతున్నారు. పట్టణంలోని 20 వార్డుల్లోని చెత్తను సింహాద్రిపురం వెళ్లే దారిలో ఉన్న చెరువు సమీపంలోనూ, స్థానిక ఐటీ కాలనీ, బాలాజీనగర్, ద్వారకానగర్‌కు ఆనుకుని ఉన్న చీడికాడ రోడ్డులోని శ్మశాన వాటికలోనూ పంచాయతీ ... మిగతా 8వ పేజీలో



ఐటీ కాలనీ, ద్వారకానగర్ సమీపంలోని చెత్త డంపింగ్ యార్డు



డంపింగ్ యార్డులో దగ్ధమవుతున్న చెత్తను ఆర్పుతున్న పంచాయతీ సిబ్బంది

వ్యర్థాలు తాండవం

నదిలోకి మురికి కాలువల అవుట్‌లెట్లు, చెత్త, వ్యర్థాలు

- రంగుమారుతున్న ఆనకట్టల మధ్య నిల్వనీరు
- నీటి కాలుష్యంలో రెండు పట్టణాలు
- పట్టించుకోని అధికారులు



తాండవ వంతెన కింద మురుగునీరు, చెత్త పేరుకుపోయిన దృశ్యం

పాయకరావుపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) :

అనకాపల్లి, కాకినాడ జిల్లాల సరిహద్దుగా ప్రవహిస్తున్న తాండవ నది జలాలు కలుషితమైపోయాయి. పాయకరావుపేట, తుని పట్టణాల డ్రైనేజీల అవుట్‌లెట్లు ఈ నదిలోకి ఉండడంతో వ్యర్థాలు, చెత్తాచెదారం నదిలో కలిసిపోయి నీరు కలుషితమైంది.



6వ వార్డులోని పంచాయతీ కాలువ అవుట్‌లెట్ తాండవ నదిలోకి ఏర్పాటు చేసిన దృశ్యం

పాయకరావుపేట పట్టణాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న తాండవ నది ద్వారా పాయకరావుపేటతోపాటు నది అవతల ఉన్న కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో 2009లో పాయకరావుపేట వద్ద తాండవ నదిపై భూమి, ముఠా ఆనకట్టలు నిర్మించారు. అయితే ఈ ఆనకట్టల మధ్య ఉన్న స్టోరేజి ఏరియాలో నదికి ఇరువైపుల ఉన్న పాయకరావుపేట పంచాయతీ, తుని మునిసిపాలిటీలకు చెందిన మురికాలువల అవుట్‌లెట్లు తొలగించకుండా అలానే వదిలివేయడంతో రెండు పట్టణాల నుంచి రోజూ వేల గ్యాలన్ల మురికినీరు స్టోరేజి ఏరియాలోకి చేరి నిల్వ నీరు వ్యర్థ జలాలుగా మారుతున్నాయి. ఈ నీరు నేరుగా భూమిలోకి ఇంకుతూ భూగర్భ జలాల కలుషితమవుతుండడంతో నది పరివాహక ప్రాంతాల్లో బోర్లు, బావుల్లో లవణాల కలిగిన నీరు ఊరుతోంది. దీనికి తోడు ఈ రెండు పట్టణాలకు చెందిన చికెన్, మటన్ దుకాణాల నిర్వాహకులు మాంసం వ్యర్థాలు, హోటళ్లు, చిరు వ్యాపారులు చెత్త, ఖాళీ కొబ్బరి బొండాలు, ఇతర వ్యర్థ పదార్థాలను నదిలో వేస్తుండడంతోపాటు రెండు పట్టణాల్లో రోజూ టన్నుల కొద్దీ సేకరించిన చెత్తను కూడా పట్టణంలో ముఠా ఆనకట్ట వద్ద తాండవ నదిగట్లపై వేస్తుండడంతో నదిలో చెత్త పేరుకుపోతోంది. నది పరిసర ప్రాంతాల్లో దుర్వాసన, దోమల ఉత్పత్తి పెరిగి రెండు పట్టణాల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఎన్నో ఏళ్లగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకున్నవారు లేరు. ఈ ప్రాంతంలో ... మిగతా 8వ పేజీలో



విశాఖపట్నంలో శనివారం మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత

పల్లా సింహాచలానికి ఘన నివాళి


పదేళ్ల పాటు గాజువాక సర్పంచ్‌గా, సుదీర్ఘ కాలం కార్మిక నేతగా, ఎమ్మెల్యేగా సేవలందించిన గాజువాకకు చెందిన పల్లా సింహాచలం (86) అనారోగ్యంతో శనివారం మృతి చెందడంతో జిల్లాలోని పలు పార్టీల నాయకులు దిగ్భ్రాంతి చెందారు. వివాదరహితుడిగా పేరొందిన ఆయన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు తండ్రి. కాగా సింహాచలం పార్థిదేహానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. - విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

10న సీఎం రాక

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

యోగ దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

9న మంత్రి నారా లోకేశ్ రాక



విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల పదో తేదీన నగరానికి రానున్నారు. సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన నూతన భవనంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌తోపాటు మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించనున్నారు. ఇంకా అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై ఆయన సమీక్షిస్తారు. సీఎం పర్యటనకు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్ రావలసి ఉంది. ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఈనెల తొమ్మిదో తేదీ ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ఇక్కడ నుంచి రోడ్డు మార్గాన పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వెళతారు. ఆరోజు రాత్రి నగరానికి చేరుకుని టీడీపీ కార్యాలయంలో బస చేస్తారు. ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి విజయవాడ వెళతారు.

విజన్ యాక్షన్ యూనిట్ల ప్రారంభానికి చర్యలు

అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న విజన్ యాక్షన్ యూనిట్‌లను సోమవారం నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, జిల్లాలోని ఎంపీడీవోలతో మాట్లాడారు. శాసనసభ నియోజకవర్గ మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న విజన్ యాక్షన్ యూనిట్‌లను ఎమ్మెల్యేలతో ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ యూనిట్‌కు శాసనసభ్యులు చైర్మన్‌గా వ్యవహరిస్తారని, నియోజకవర్గ ప్రత్యేకాధికారి, కేటాయించిన ఐదుగురు సిబ్బంది యూనిట్‌లో ఉంటారని తెలిపారు. యూనిట్‌లకు ... మిగతా 8వ పేజీలో

జనసేన పార్టీలో భారీగా చేరికలు



జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే విజయకుమార్, పార్టీ శ్రేణులు

ఎలమంచిలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని పదో వార్డుకు చెందిన వైసీపీ నాయకులు పదిమంది శనివారం జనసేనలో చేరారు. వీరికి ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైసీపీ నుంచి జనసేనలో చేరిన వారిలో తాటిపాకల నాని, శెలంశెట్టి లక్ష్మీనారాయణ, బలిరెడ్డి శివ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి పాలన, జనసేన అధినేత పవన్ కల్యాణ్ విధానాలకు ఆకర్షితులై నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో చేరికలు జరుగుతున్నాయన్నారు.

ప్రతిభా అవార్డులకు ఐదుగురు విద్యార్థులు ఎంపిక

అచ్యుతాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి భవానీ విద్యానికేతన్‌లో పదో తరగతి చదివిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభ అవార్డులకు ఎంపికయ్యారు. ఆరు వందల మార్కులకు గాను 595 మార్కులు సాధించిన ఆర్.ప్రసన్న, కె.యజ్ఞశ్రీ, ఎల్.ధరణి, ఎస్.ఆశ్రితలతో పాటు ఎస్.లోహిత్ కుమార్ ఈ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు కూండ్రపు మూర్తి ప్రసాద్, కరస్పాండెంట్ సంతోష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే, టెన్త్ ఫలితాలు విడుదలైన రోజు సాయంత్రం పూడిమడకకు చెందిన లోహిత్‌కుమార్ బైక్ ప్రమాదంలో మృతిచెందాడు. తమ కుమారుడు ప్రతిభా అవార్డుకు ఎంపికైనప్పటికీ తమ మధ్యలో లేకపోవడం పట్ల ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

10న యాదవ విద్యార్థులకు పురస్కారాలు



ఆహ్వాన పత్రాలు అందిస్తున్న రంగనాయకులు

ఎలమంచిలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఈఏడాది పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన యాదవ సామాజికవర్గానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు శనివారం ఎలమంచిలి పట్టణంలోని పలువురికి అందజేశారు. ఈ నెల పదో తేదీన అనకాపల్లి నూకాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద గల లక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఈ వేడుకకు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కొన శంకర్రావు, ధూళి దేవుళ్లు, టైలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కోశాధికారి వియ్యపు సత్తిబాబు, శ్రీను, గొలగాని సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

'10 వరకు వివిధ రకాల పోర్టల్ సేవలు నిలుపుదల'

మునగపాక, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాల్లో ఏపీ సేవా పోర్టల్ ద్వారా అందిస్తున్న సేవల్లో పది రకాలను ఈ నెల పదో తేదీ వరకు నిలుపుదల చేసినట్టు ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. ఏపీ సేవా పోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ అజ్యూర్ క్లౌడ్ నుంచి ఏపీ రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలింపు ప్రక్రియ జరుగుతున్న కారణంగా శనివారం నుంచి పదోతేదీ వరకు ఆదాయ, వృద్ధాప్య, వివాహ ధ్రువీకరణ, భూమి మ్యూటేషన్లు, రైస్ కార్డులు, ఇళ్ల స్థలాలు, రెవెన్యూ, వాటర్ ట్యాక్స్, పట్టణ పరిపాలన, మత్స్యశాఖకు సంబంధించిన సేవలు తాత్కాలికంగా నిలిచాయన్నారు. మిగిలిన ఇతర సేవలు అందుబాటులో ఉన్నట్టు వివరించారు.

ప్రజారోగ్యానికి 'పొగ'!

» మునిసిపాలిటీలో చెత్తకు తరచూ నిప్పు » పొగతో ఊపిరాడక జనం ఉక్కిరిబిక్కిరి » పారిశుధ్య సిబ్బంది తీరుపై ఆగ్రహం



చెట్లను కమ్ముకున్న పొగ



పట్టణంలోని గాంధీనగర్ రోడ్డు పక్కన ఉన్న చెత్తకు నిప్పుపెట్టిన దృశ్యం (ఫైల్)

ఎలమంచిలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడిన కారణంగా ప్రతి రోజూ వీధుల్లో సేకరించిన చెత్తకు కొన్ని ప్రాంతాల్లో నిప్పు పెడుతున్నారు. ఇదిచూసిన వారు ప్రజారోగ్యానికి ఇలా పొగ పెట్టడం తగునా.. అని ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోని వీధుల్లో పర్యటించి పారిశుధ్య సిబ్బందికి ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన ప్రజారోగ్య శాఖ అధికారులు కేవలం కార్యాలయానికే పరిమితమవుతుండడం వల్ల కొందరు సిబ్బంది ఇలా చెత్త కుప్పలకు నిప్పు పెడుతున్నారని ప్రచారంలో ఉంది. ఈ పొగ కారణంగా అటుగా రాకపోకలు సాగించేవారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సమీపంలోని వారు అస్వస్థతకు గురైన సంఘనటలు కూడా ఉన్నాయని అంటున్నారు. చెత్త కుప్పలకు నిప్పు పెట్టకూడదనే నిబంధన ఉన్నప్పటికీ ఇక్కడ పట్టించుకునే వారు కరువయ్యారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మునిసిపాలిటీలోని 25 వార్డుల్లో సుమారు 98 మంది వరకూ పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ ఇక్కడ సుమారు 17 టన్నుల వరకు చెత్తను సేకరిస్తున్నారు. కానీ కొన్ని వార్డుల్లో గుట్టుచప్పుడు కాకుండా చెత్త కుప్పలకు నిప్పు పెడుతున్నారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన సదరు సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం వల్లే తరచూ ఈ సమస్య తలెత్తుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ సమస్యపై తక్షణమే దృష్టి సారించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



ఎలమంచిలిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రాంబిల్లి మండలం గోవిందపాలెంలో...

ఎలమంచిలి/రాంబిల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎలమంచిలి పట్టణంలోని ముస్లిలంతా ఉదయం ఎనిమిది గంటలకే ఈద్గా వద్దకు చేరుకుని మతగురువు సమక్షంలో ప్రత్యేక నమాజ్ చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. అలాగే, రాంబిల్లి మండలంలోని గోవిందపాలెంలో బక్రీద్ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతగురువు ఎస్‌కే అన్సార్ మదీనా మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా ఈ వేడుక నిలుస్తుందన్నారు.

రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన దేవతామూర్తుల విగ్రహాలు

ఎలమంచిలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధి రామ్‌నగర్ వార్డు ప్రధాన రోడ్డు పక్కన నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ స్థానిక నేతలతో కలిసి దేవతామూర్తులను దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'కార్మికుల పని గంటల పెంపు నిర్ణయంపై ఆందోళన'



అచ్యుతాపురంలో నాయకులు ఆందోళన

అచ్యుతాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కార్మిక వర్గానికి నష్టదాయకంగా రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం తగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము అన్నారు. అచ్యుతాపురం జంక్షన్‌లో శనివారం పలువురు కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పనిగంటల పెంపు నిర్ణయం తగదన్నారు. వీరికి కనీస వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించుకోవాలన్నారు. నాయకులు కె.సోమునాయుడు, మారిశెట్టి అప్పారావు, శంకరరావు, వాసుపల్లి కోసుబాబు, నూకమ్మ, దుర్గ, నాగమణి పాల్గొన్నారు.

ఉదయం ఎండ మండింది.. సాయంత్రం వాన కురిసింది



అచ్యుతాపురంలో వర్షం కురుస్తున్న దృశ్యం

ఎలమంచిలి/ అచ్యుతాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా ఎలమంచిలి, అచ్యుతాపురం మండలాల్లో శనివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు ఉగ్రరూపం చూపాడు. తొమ్మిది గంటల నుంచే వేడి వాతావరణం ఆరంభమైంది. దీనికితోడు ఉక్కపోత మరింత ఉక్కిరిబిక్కిరి చేసింది. దీంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. చిరుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం పడడంతో అంతటా ఒక్కసారిగా చల్లబడింది. లోతట్టు ప్రాంతాల్లో ఎటుచూసినా నీరే కనిపించింది. పలుచోట్ల రహదారులపై గంతులు పడడంతో అందులో నీరు చేరడంతో ఇది గుర్తించలేని వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా అచ్యుతాపురం సెజ్‌లోని వివిధ కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ తమ గ్రామాలకు వెళ్లేటప్పుడు గోతుల్లో నీరు కారణంగా అవస్థలకు గురయ్యారు. వాతావరణం చల్లబడడంతో అంతా ఉపశమనం పొందారని చెప్పవచ్చు.

ఉపమాక వెంకన్నకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

నక్కపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు కొండపై వున్న స్వామి నిజరూపానికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకం చేసి, ధూప,దీప నైవేద్య నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. కింద ఆలయంలో క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని పట్టుపీతాంబరాలతో అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయం సందడిగా మారింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్



మసీదులో ప్రత్యేక ప్రార్థనలుచేస్తున్న ముస్లింలు

కోటవురట్ల, జూన్7: మండల కేంద్రంలో శనివారం ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9గంటల కు ముస్లింలంతా మసీదులో ప్రార్థనలు చేశారు. మెయిన్‌రోడ్డు పక్కన గల మసీదులో సుల్తాన్ నేతృత్వంలో ముఫ్తీలు ఈద్ నమాజ్ చదవించారు. టీడీపీ సీనియర్ నాయకులు జానకీ శ్రీనివాసరావు, యలమించిలి సూర్యప్రకాష్, సుంకర బాబ్జీ, బోడపాలెం సత్యనారాయణ ఈ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కోటవురట్ల, స్థానిక పాత సంత, టీకేపల్లి, లింగాపురం తదితర గ్రామాల్లో మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నమాజ్ పఠించారు. ముస్లిం పెద్దలు సుల్తాన్, ఇస్మాయిల్, అలీ, ఖాసీం బేబీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రసాద్

కోటవురట్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యండపల్లి, అన్నవరం, టీకే పల్లి గ్రామాల్లో వికసిత్‌కృషి సంకల్పఅభియాన్ కార్యక్రమం నిర్వహించారు. బీసీటీ కృషి విజ్ఞానం శాస్త్రవేత విప్రసాద్ మాట్లాడుతూ ఎరువుల వినియోగం తగ్గించాలని కోరారు. తొలకరిలో కురుస్తున్న వర్షాలకు పచ్చి రొట్ట ఎరువులు వేసి పొలాలను కలియదున్నాలని సూచించారు. పశువుల గెత్తం తప్పకుండా వేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం పట్ల దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన యంత్రీకరణ శాస్త్రవేత శ్రీకాంత్‌గౌడ్, గ్రామ వ్యవసాయ సహాయకులు త్రినాద్, గంగా, హరికృష్ణ, పాల్గొన్నారు.



ఇందేశమ్మఘాట్‌లో చెరువును తలపిస్తున్న రహదారి



రామచంద్రపురం వద్ద ఛిద్రమైన దృశ్యం

ఈ రోడ్డును చూస్తే.. గుండె చెరువే!

» రామచంద్రపురం నుంచి అడ్డురోడ్డు మార్గం అధ్వానం

» గోతుల్లో చేరిన వర్షం నీరు » వాహనదారులు బెంబేలు

కోటవురట్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో రహదారులు అధ్వాన స్థితికి చేరాయి. ఎక్కడికక్కడ గుంతల్లో నీరు చేరి పాదచారులు, వాహనదారులకు నరకాన్ని చూపుతున్నాయి. ఇందేశమ్మఘాట్ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనచోదకులు భయపడిపోతున్నారు. ఈ మార్గంలో అడుగడుగునా గుంతలతోపాటు కొన్నిచోట్ల పూర్తిగా రోడ్డు దెబ్బతింది. రామచంద్రపురం నుంచి ఎస్. రాయవరం మండలం అడ్డురోడ్డు వరకు వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. ఈ రహదారి మరమ్మతులకు హోం మంత్రి వంగలపూడి అనిత రూ. 29 కోట్లు మంజూరు చేశారు. దార్లపూడివద్ద ఒక కిలోమీటర్ మేర సిమెంట్ రోడ్డు మాత్రమే బాగుచేశారు. ఇరువైపులా ఇందేశమ్మవాకనుంచి అడ్డురోడ్డు వరకు రోడ్డురామచంద్రపురం వద్దనుంచి రహదారి పూర్తి ధ్వంసమైంది. వీటిని పట్టించుకోకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

వర్షంతో చల్లపడిన వాతావరణం

నక్కపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ, ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు అల్లాడి పోయారు. సాయంత్రం 3 గంటల నుంచి దట్టమైన మేఘాలు అలముకున్నాయి. నక్కపల్లి, సీతంపాలెం, జీ జగన్నాథపురం, దోసలపాడు, ముకుంద రాజుపేట, రేబాక, గొడిచెర్ల, చినదొడ్డిగల్లు గ్రామాల్లో వర్షం పడింది. వాతావరణం చల్లబడడంతో సేదతీరారు.

క్రికెట్ కిట్ పంపిణీ



క్రికెట్ కిట్ పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు

నక్కపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెల్లికాలనీకి చెందిన యువ ఆటగాళ్లకు శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మేడేటి శంకర్ క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఈ క్రికెట్ కిట్లు అందజేసినట్టు చెప్పారు. అలాగే, ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. మేడేటి శంకర్ సేవా కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

» రాజమహేంద్రవరం వాణిజ్యపంటల పరిశోధనా సంస్థ సీనియర్ శాస్త్రవేత్త ప్రభాకర్‌రావు



చిరు ధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ప్రభాకర్‌రావు

నక్కపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలను సాగు చేసుకుని వాటిని, ఒక పూట భోజనంలో వీటిని క్రమం తప్పకుండా తీసుకుంటే ఎంతో ఆరోగ్యంగా ఉంటారని రాజమహేంద్రవరం వాణిజ్యపంటల పరిశోధనా సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. ప్రభాకర్‌రావు సూచించారు. మండలంలోని దోసలపాడు, రేబాక, డీఎల్ పురం, గ్రామాల రైతులకు వికసిత కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. చిరు ధాన్యాలను సాగు చేసే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. డ్రోన్ వినియోగాన్ని పెంచడం ద్వారా చీడపీడలను సకాలంలో తక్కువ ఖర్చుతో నివారించుకోవచ్చని తెలిపారు. 'సాయన ఎరువులను సరైన మోతాదులో వాడుతూ జీవ నియంత్రణ పద్ధతులను అవలంబించాలని సూచించారు. ఉద్యానవన శాస్త్రవేత్త ఎం.శివ మాట్లాడుతూ మామిడి, బొప్పాయి, కూరగాయల పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. నవధాన్య పచ్చిరొట్ట ఎరువులపై బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ వివరించారు. ఈ సమావేశంలో పక్కుర్తి రమణ, నాగు, కరణం సూర్యనారాయణ, సాదిరెడ్డి వర ప్రసాద్, ఆదినారాయణ, శానాపతి విజయ్ కుమార్, గంట్యాడ రమేశ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గోకులపాడులో సీసీ కెమెరాల ఏర్పాటు



విద్యుత్ స్తంభానికి ఏర్పాటుచేసిన సీసీ కెమెరాను ప్రారంభిస్తున్న సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు

ఎస్. రాయవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం పంచాయతీ పరిధి గోకులపాడులో గ్రామానికి చెందిన జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు మత్తి కార్తీక్ రూ. 23 వేల సొంత నిధులతో సీసీ కెమెరాలను పలు చోట్ల ఏర్పాటు చేశారు. శనివారం వీటిని నక్కపల్లి రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు ప్రారంభించారు. గ్రామంలో చోరీల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జనసేన పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నక్కా శ్రీనివాస్ సమస్యను కార్తీక్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన తన సొంత నిధులతో సీసీ కెమెరాలు కొనుగోలు చేసి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ మాట్లాడుతూ జనసేన నాయకులు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయమన్నారు. వీటి వల్ల దొంగతనాలతోపాటు అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహి ళా పోలీసు ఝాన్సీ, జనసేన మండల కో-ఆర్డినేటర్ రమణ, చిన్నరాజు, నాగేశ్, సురేశ్, వాసు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం: వ్యక్తి అరెస్టు

పాయకరావుపేట రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటపల్లి గ్రామంలో శనివారం నాటు సారా స్థావరాలపై దాడి చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సోమయ్య తెలిపారు. సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. అనంతరం నిందితుడిని కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ సోమయ్య తెలిపారు. ఈ దాడుల్లో అనకాపల్లి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ టి. వెంకటఅప్పలనాయడు, సబ్ ఇన్‌స్పెక్టర్ పి.వి. గిరి, సిబ్బంది ఎంఎస్.రాజు, సి.హెచ్.మధుసూదనరావు, , వి.సంతోశ్ పాల్గొన్నారు.

జనసైనికుల కుటుంబాలకు బీమాతో ఆసరా



బాధిత కుటుంబానికి బీమా చెక్కు పంపిణీ చేస్తున్న గెడ్డం బుజ్జి

ఎస్. రాయవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు పొందిన వారు ప్రమాదాలకు గురై మృతి చెందినట్టయితే ఆ కుటుంబాలకు బీమా ద్వారా ఆర్థికంగా ఆదుకోవడమే ధ్యేయంగా ఉప ముఖ్యమంత్రి, పార్టీ వ్యవస్థాపకులు పవన్ కల్యాణ్ పనిచేస్తున్నారని పాయకరావుపేట నియోజవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి అన్నారు. గత ఏడాది మండలంలో గోకులపాడుకు చెందిన జనసైనికుడు బత్తుల సత్తిబాబు ప్రమాదానికి గురై మృతి చెందారు. ఈస్థితిలో మంజూరైన రూ. 5 లక్షల బీమా చెక్కును శనివారం పార్టీ మండల ఉపాధ్యక్షుడు మత్తి కార్తీక్, గ్రామ అధ్యక్షుడు నక్కా శ్రీనివాస్ సమక్షంలో బుజ్జి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ప్రాధాన్యంను స్థానికులకు వివరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు జగ్గన్నదొర, వెలగా సుధాకర్, సంజీవు, పాయకరావుపేట ఏఎంసీ డైరెక్టర్ ప్రసాదుల గణేశ్, కలిగట్ల నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

▸▸ అత్యంత పవిత్రంగా జరుపుకున్న ముస్లింలు

▸▸ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు



అనకాపల్లి జామియా మసీదులో ముస్లింల ప్రార్థనలు

అనకాపల్లి టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్‌ను ముస్లింలంతా శనివారం అత్యంత పవిత్రంగా జరుపుకున్నారు. పట్టణంలోని మసీదు వీధిలో గల జామియా మసీదులో అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఒకరినొకరు అలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులతో కలిసి వేడుక జరుపుకున్నారు.

కశింకోట : మండల కేంద్రం కశింకోట నూరి మసీదులో బక్రీద్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత గురువు జియాహుల్ రెహమాన్ సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈద్ అల్ ఆదా (బక్రీద్) త్యాగానికి ప్రతీకగా పేర్కొన్నారు. టీడీపీ మైనార్టీ సెల్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్ (బాబర్), మసీదు మాజీ అధ్యక్షుడు షెహద్ రెహమ్‌తుల్లా, హాజీ హసన్, ఎంఎ రబ్బాని, ఎస్ఎంఎంఎ అలీ, సయ్యద్ మహబూబ్ సుభాని, అబ్దుల్ రజిక్, సయ్యద్ అన్వర్, ముస్తఫా, అబ్దుల్ రషీద్ ఖాన్, ఇంతియాజ్ షరీఫ్, ఎంఎ షఫీ, మున్నా, షేక్ గౌస్, షేక్ సత్తార్‌లతో పాటు పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.



కశింకోటలోని నూరి మసీదులో...

'కేంద్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు అందాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ

కొత్తూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అర్హులకు అందాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్ధ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల సుపరిపాలనపై శనివారం అనకాపల్లి పట్టణంలోని గాంధీనగరంలో ఉన్న మాధవసదన్‌లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లక్ష్మీనారాయణతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్రి చిట్టిబాబు, పొన్నగంటి అప్పారావు, పుట్టా గంగయ్య, వర్మ, ప్రసాద్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం : డీఎస్పీ



న్యాయ విశ్వ విద్యాలయంలో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

సబ్బవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణ సమయాల్లో రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ సూచించారు. ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం విద్యార్థులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని వివరించారు. ఈ అంశాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ జి.రామచంద్రరావు, ఎస్ఐలు పి.సింహాచలం, దివ్యతో పాటు న్యాయ విశ్వ విద్యాలయం అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా తోడపెద్దు అచ్చుపోత మహోత్సవం



తోడపెద్దులను పురవీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చినరామస్వామి ఆలయం వద్ద తోడపెద్దు అచ్చుపోత మహోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తోడపెద్దులను ఈ వేడుకకు తీసుకు వచ్చారు. చినరామస్వామి ఆలయం నుంచి గవరపాలెం పురవీధులతో పాటు మెయిన్ రోడ్డు మీదుగా శారదానది వరకు వాటిని ఊరేగారు. ఈ సందర్భంగా భారీఎత్తున అన్న సమారాధన జరిపారు. ఊరేగింపులో భాగంగా సింహాద్రి అప్పన్న రథం వద్ద గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పూజలు జరిపారు. చినరామస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు విల్లూరి పైడారావు, విల్లూరి మహాలక్ష్మినాయుడుతో పాటు, ఆ ప్రాంతవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ



సబ్బవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇరువాడ గ్రామంలో గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నిరుపేదలకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొటాన రాము హాజరై సుమారు ముప్పై కుటుంబాల వారికి వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ పువ్వల విజయకుమార్, సభ్యులు ఇస్సాక్, మేథ్యూ, తేజ, స్నైలీ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి తావు లేకుండా వైద్య సేవలు

▸▸ వైద్యాలయం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్



సమావేశంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న డైరెక్టర్లు

అనకాపల్లి టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో అవినీతికి తావులేకుండా ప్రజలకు వైద్యసేవలందించాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమక్షంలో ఆస్పత్రి అభివృద్ధి కోసం ఐదుగురు డైరెక్టర్లు, ఆరుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నారు. డైరెక్టర్లు డాక్టర్ డీడీ నాయుడు, ఆళ్ల రామచంద్రరావు, తాడి శాంతికుమారి, గొర్లి శేఖర్, ఉల్లింగల రమేష్‌లతో ప్రమాణ స్వీకారం చేయించి ఆస్పత్రిలో ని వివిధ విభాగాలకు పర్యవేక్షకులుగా నియమించారు.

ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో వైద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 200 పడకల ఆస్పత్రిగా ఉన్న వైద్యాలయాన్ని 400 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దే ఆలోచనలో ఉన్నామన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పలు వార్డులను సందర్శించి రోగులను పరామర్శించి వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ కె.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కె.కృష్ణారావు, ఇన్‌చార్జి డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

'బాలికా సాధికారతకు సింహాద్రి కృషి భేష్'



విద్యార్థినుల నృత్యరూపకం



విద్యార్థినులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

పరవాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బాలికా సాధికారత కోసం సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమని కలెక్టర్ విజయకృష్ణన్ ప్రశంసించారు. సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక దీపాంజలినగర్‌లో బాలికా సాధికారిత (జెమ్-2025) పేరుతో గత నాలుగు వారాలుగా నిర్వహిస్తున్న కార్యక్రమం శనివారంతో ముగిసింది. స్థానిక శకుంతల ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిర్వాసిత గ్రామాల బాలికల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని వారి కోసం ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండడం అవసరమన్నారు. జెమ్ ద్వారా నేర్చుకున్న విజ్ఞానం భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కాగా ఐదవ తరగతి పూర్తి చేసుకున్న 115 మంది విద్యార్థినులకు నాలుగు వారాల వర్క్‌షాపులో కళలు, క్రీడలు, సంగీతం, కంప్యూటర్ అక్షరాస్యత, ఇంగ్లీషు, తెలుగు, గణితం, పర్యావరణ శాస్త్రాలలో తర్ఫీదునిచ్చారు. ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం జెమ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న బాలికలకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ కార్పొరేట్ ప్లానింగ్ విభాగం ఈడీ సంగీత కౌశిక్, సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్ శర్మ, దీపికా లేడీస్‌క్లబ్ అధ్యక్షురాలు నీతాశర్మ, సింహాద్రి వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, సీఎస్ఆర్ ప్రతినిధులు, సింహాద్రి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా శ్రీనివాస కల్యాణం



శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



వేడుకను తిలకిస్తున్న భక్తులు

కశింకోట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో గల వేంకటేశ్వర ధ్యాన మందిరం ఎనిమిదో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు, అర్చనలు జరిపారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన ఏర్పాటైంది. సాయంత్రం ఆరు గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు కన్నులపండువగా జరిపించారు. ఈ వేడుకను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆదివారం సాయంత్రం గరుడోత్సవం జరపనున్నామని ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి శ్రీరామచరణాచార్యులు తెలిపారు.

ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు యోగా

▸▸ పాఠశాలల్లో ఉపాధ్యాయులు రోజూ అవగాహన కల్పించాలి

▸▸ 'యోగాంధ్ర'లో డీఈవో గిడ్డి అప్పారావునాయుడు



అవగాహన ర్యాలీలో డీఈవో అప్పారావునాయుడు, తదితరులు



యోగాసనాలు వేస్తున్న విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు యోగా నేర్పించాలని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. ఇక్కడి రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన యోగాంధ్రలో మాట్లాడారు. యోగా సాధన ద్వారా ఆరోగ్యం అన్ని విధాల అనుకూలంగా ఉంటుందన్నారు. యోగా ప్రాధ్యానతను ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు తెలియజేయవలసిన అవసరం ఉందని వివరించారు. ప్రతి రోజు పాఠశాలలో నిర్వహించే ప్రార్థన, డ్రిల్ కార్యక్రమాల్లో యోగా ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేయాలని, ఇందుకు ప్రతి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ డీఈవో పొన్నాడ అప్పారావు, ఆయుష్ విభాగం ఇన్‌చార్జి లావణ్య, డీఎస్‌డీవో రమణ, మండల విద్యాశాఖాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

'యోగాంధ్రలో భాగస్వాములు కావాలి'

పరవాడ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో ఉపాధి కూలీలు భాగస్వాములు కావాలని వెన్నెలపాలెం ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు కోరారు. శనివారం ఆయన గ్రామంలో గల ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం వీఆర్‌పీ వి.గంగునాయుడు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో భారీగా చేరికలు



జనసేనలో చేరిన వారిలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, నాయకులు

సబ్బవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు శనివారం జనసేన చేరారు. ఆ పార్టీ మండల కన్వీనర్ కర్రి కనకరాజు ఆధ్వర్యంలో ఇరువాడ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైస్ ఎంపీపీ మామిడి లక్ష్మి, కొండాజీ ఆధ్వర్యంలో నారపాడు నుంచి 55 మంది, సబ్బవరం ఎంపీటీసీ-2 బైలపూడి దేముడుబాబు ఆధ్వర్యంలో 60 మంది, అమృతపురం ఎంపీటీసీ సింగంపల్లి శ్రీను ఆధ్వర్యంలో 110 మంది, సబ్బవరం టి.శేఖర్ ఆధ్వర్యంలో 35 మంది, గాలిభీమవరం బలిరెడ్డి అప్పారావు, రామకృష్ణ ఆధ్వర్యంలో 36 మంది, అయ్యన్నపాలెం, వంగలి నుంచి 30 మంది జనసేన పార్టీలో చేరినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పెందుర్తి నియోజకవర్గాన్ని రూ.125 కోట్లతో అభివృద్ధి చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రంలో పార్టీ నాయకులు పంచకర్ల వెంకటేశ్వరరావు, బలిరెడ్డి అప్పారావు, ఇందలి రమణ, సాలాపు వెంకటేశ్వరరావు, శరగడం రాము, బోకం స్వామినాయుడు, ఉగ్గిన రాము, గొర్లి కుమార్, కొల్లి కృష్ణ, బంతికోళ్ల పద్మ, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, పల్లి మంగరాజు, బలిరెడ్డి రామకృష్ణ, కర్రి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం ఎండ.. మధ్యాహ్నం వాన

▸▸ మూడు రోజులుగా పలు మండలాల్లో విభిన్న వాతావరణం



తుమ్మపాల గుండాల వద్ద మెయిన్‌రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

తుమ్మపాల/తుమ్మపాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజుల నుంచి జిల్లాలో విభిన్న వాతావరణం నెలకొంటోంది. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఇంట్లో ఉన్నా, వీధిలోకి వెళ్లినా జనం ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. మూడు గంటల తరువాత ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై, చిరు గాలులతో భారీగా వర్షం కురుస్తోంది. శనివారం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండమండింది. 36.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీనికితోడు ఉక్కపోత జనాన్ని మరింత వేధించింది. ఒంటి గంట సమయంలో చాలా వరకు రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. మూడు గంటలు కాగానే ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సుమారు 45 నిముషాల పాటు ఏకధాటిగా పడడంతో ఎటుచూసినా నీరే కనిపించింది. అనకాపల్లిలో 34.0 ఎంఎంగా వర్షపాతం నమోదైనట్టు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. రోడ్డుకు పల్లంగా ఉన్న ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపించింది. అలాగే, విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోవడంతో అనకాపల్లి- చోడవరం మార్గాల మధ్య రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



అనకాపల్లి ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న అద్దె బస్సుల కార్మికులు

పని గంటల పెంపుపై కార్మికులు నిరసన

అనకాపల్లి టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఇక్కడి ఆర్టీసీ డిపో వద్ద ఏపీఎస్ ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్, అద్దె బస్సుల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా పనిగంటలు పెంచుతూ నిర్ణయించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను పార్లమెంట్‌లో ఆమోదించిందని, ఈ లేబర్ కోడ్‌లలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూల్స్‌ను నిర్ణయించి ఎనిమిది గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచడం అన్యాయమన్నారు. రాత్రి పూట నైట్‌షిఫ్ట్ డ్యూటీలు మహిళలకు వేయవచ్చునని ప్రభుత్వం తీర్మానించి ఉత్తర్వులు ఇచ్చిందని, ఈ విధానం కార్మికవర్గానికి నష్టం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలకా సత్యనారాయణ, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి పీఎస్‌వీ పరమేశ్వరరావు, నూకరాజు, నరసింగరావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : రాష్ట్రంలో పని గంటలు పెంచుతూ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఇక్కడి సినిమా హాల్ జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్య నారాయణ మాట్లాడుతూ కార్మికుల పని గంటల పెంపు సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్.వెంకునాయుడు, కె.అర్జున్, ఎన్.గుర్నాథరావు తదితరులు పాల్గొన్నారు.



పరవాడలో..


'విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలపై ఆందోళనలు'



మాట్లాడుతున్న పెంటకోట సత్యనారాయణ

తుమ్మపాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డెయిరీ వేతన కార్యదర్శులు, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఇక్కడి సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. గత నలభై ఏళ్లుగా డెయిరీ అభివృద్ధిలో వేతన కార్యదర్శులు, హెల్పర్లు కీలకపాత్ర పోషిస్తున్నప్పటికీ యాజమాన్యం గుర్తించకపోవడం తగదన్నారు. కనీస వేతనాలు, గ్రాట్యుటీ అంశాలపై కార్మికులు పలుమార్లు యాజమాన్యాన్ని కోరినప్పటికీ స్పందించకపోవడం తగదన్నారు. ఇందుకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఏఐటీయూసీ నాయకులు రాజాన దొరబాబు, వైఎన్ భద్రం, యూనియన్ నాయకులు గంగుపాం కనకారావు, సూర్యారావు, ప్రసాద్, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న సీఐ

పరవాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ సామాజిక న్యాయశాఖ ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి దేశపాత్రునిపాలెం గ్రామంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. తొలిత ఈ పోటీలను పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ప్రారంభించారు. యువకులు ఉత్సాహంగా తలపడ్డారు. విజేతలకు సీఐ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అంతకు ముందు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అందరితో సీఐ ప్రతిజ్ఞ చేయించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిళ్లా శివకృష్ణ, ఏవీ రామారావు, శనివాడ ప్రకాశ్, లక్కరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల నిర్మాణానికి సిమెంటు వితరణ

కశింకోట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నర్సింగబిల్లిలోని వేంకటేశ్వర దేవాలయంలో దశావతారాల విగ్రహాల నిర్మాణానికి సాగర్ సిమెంటు యాజమాన్యం 75 సిమెంటు బస్తాలను విరాళంగా అందజేసినట్టు వెంకటేశ్వర దేవస్థానం కమిటీ ప్రతినిధులు తెలిపారు.

గిరిజనుడికి ఉత్తమ రైతు అవార్డు



అవార్డుకు ఎంపికైన జిన్ను

డుంబ్రిగుడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి):ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ నుంచి ఉత్తమ రైతుగా మండలంలోని అరమ పంచాయతీ బడిమెల గ్రామానికి చెందిన తాంగుల జిన్ను ఎంపికయ్యారు. జిన్ను.. డాక్టర్ ఎం.వి. రెడ్డి అవార్డుతోపాటు ప్రశంసా పత్రం, జ్ఞాపికతోపాటు రూ. 25 వేలు నగదు ప్రోత్సాహం అందుకోనున్నారు. ఈ గిరిజన రైతు 2017లో వనవికాస మ్యాక్స్ బోర్డు సహకారంతో మాతోట ద్వారా ఎకరా భూ మిలో 21.6 క్వింటాళ్ల గులి రాగిని పండించారు. అలాగే, వాణిజ్య పం టలను సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ ఆదా యాన్ని పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 12న గుంటూరు జిల్లా క్రిష్ణ ఆడిటోరియంలో జరగనున్న కార్యక్రమంలో అతను ఈ అవార్డును తీసుకోనున్నట్టు వికాస సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ తెలిపారు.

187 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

ముంచంగిపుట్టు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)తోపాటు కిలగాడ పీహెచ్‌సీలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విజయనగరం శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పలు సమస్యలతో బాధపడుతున్న 187 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణుడు కిశోర్‌కుమార్ మాట్లాడుతూ కంటి చూపు సమస్యతో బాధపడుతున్న 67 మందిని గుర్తించి, వారికి శస్త్రచికిత్సల నిమిత్తం ప్రత్యేక బస్సులో విజయనగరం తరలించినట్టు చెప్పారు. శస్త్రచికిత్సల సమయంలో ఉచితంగా భోజనం, వసతి మూడు రోజుల పాటు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రమేశ్, శిరీష, గీతాంజలి, ధరణి, నాయక్, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, పుష్పగిరి ఆసుపత్రి వైద్య నిపుణులు , సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల పునఃప్రారంభం రోజే విద్యా మిత్ర కిట్లు పంపిణీ: ఎంఈవో



ఉపాధ్యాయులు పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో ప్రసాద్

చింతపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం రోజే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు అందజేస్తామని ఎంఈవో పీబీవీవీ ప్రసాద్ అన్నారు. శనివారం వివిధ పాఠశాలలకు పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల పునః ప్రారంభం జూన్ 12తేదీన విద్యార్థి మిత్ర కిట్లను అందజేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. మండల కేంద్రాలకు సరఫరా అయిన నోట్, పాఠ్య పుస్తకాలను వివిధ పాఠశాలలకు ముందుగానే తరలించామన్నారు. ఉపాధ్యాయులు వీటిని ప్రతి పిల్లవాడికి తొలిరోజే అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జేపీ కొండలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ముగ్గురు విద్యార్థులు ఎంపిక



పాడిశెట్టి జెస్సిక, వివేక్ నాగసాయి, గబ్లంగి జోష్నా

కొయ్యూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్‌మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్టు ఎంఈవో రాంబాబు తెలిపారు. 8వ తరగతి చదువుతున్న పాడిశెట్టి జెస్సిక, చింత వివేక్ నాగసాయి, గబ్లంగి జోష్నా ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది కృష్ణ పడాల్, తిరుపతి రావు, చందు, శ్రీనివాసరావు, రాజశేఖర్, అప్పలరాజమ్మ లావణ్యవతి, అరుణకుమారి, గోవింద్ నాయుడు అభినందించారు. అలాగే, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కుల సాధించిన కొయ్యూరుకు చెందిన బొజ్జా కిరణ్ దీప్తి ప్రతిభా అవార్డుకు ఎంపికైంది. నర్సీపట్నం కారుణ్య జూనియర్ కళాశాలలో ఇంటరు బైపీసీ గ్రూపులో చదివి 983/1000 మార్కులు సాధించింది.

చింతపల్లి సీడీపీవో జీవీ రమణ బదిలీ

చింతపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జీవీ రమణ నర్సీపట్నం ప్రాజెక్టుకి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నర్సీపట్నం ప్రాజెక్టులో పనిచేస్తున్న సీడీపీవో సువార్తను నియమించారు. తాజా బదిలీల్లో జీవీ రమణకు బదిలీ ఉత్తర్వులు శనివారం అందాయి. ఆమె రెండేళ్లపాటు చింతపల్లి ప్రాజెక్టు పరిధిలో సీడీపీవోగా పనిచేశారు. నూతన సీడీపీవో సోమవారం విధుల్లో చేరనున్నారు.

డుంబ్రిగుడ సీడీపీవోగా ఎస్తేరురాణి

డుంబ్రిగుడ: స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో బదిలీపై నీలిమ విశాఖపట్నం సిటీ అర్బన్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో పాడేరు పీడీ కార్యాలయంలో నోడల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎస్తేరురాణిని డుంబ్రిగుడ సీడీపీవోగా రానున్నారు.



జీకేవీధి: అరసాడలో కూలిన వృక్షాలు... విరిగిపోయిన విద్యుత్ స్తంభం



గాలివాన బీభత్సం

» రహదారులు జలమయం

చింతపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో గాలితో కూడిన భారీ వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు కుండపోతగా వాన కురిసింది. ప్రధాన రహదారులన్నీ వాగులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చింతపల్లి సాయిబాబా ఆలయం సమీపంలో విద్యుత్ స్తంభం విరిగి జాతీయ రహదారిపై పడింది. స్పందించిన ఈపీడీసీఎల్ సిబ్బంది విరిగిపోయిన స్తంభాన్ని తొలగించారు. మరో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కూలిన వృక్షాలు, విద్యుత్ స్తంభం

గూడెంకొత్తవీధి: మండలంలో గాలివానకు వృక్షాలు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. అసరాడ గ్రామంలో విద్యుత్ తీగలపై భారీ వృక్షాలు కూలాయి. దీంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ప్రస్తుతం అసరాడతోపాటు మరో ఐదు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కొయ్యూరులో..

కొయ్యూరు: మండలంలో శనివారం మధ్యాహ్నం సుమారు గంటకుపైగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది దీంతో వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఎండ దారెత్తించింది. అనంతరం ఒంటి గంట ప్రాంతంలో మేఘాలు కమ్ముకుకు భారీ వర్షం కురిసింది. ఖరీఫ్ సాగులో వరినారు మడులు దుక్కిలకు ఈ వర్షం మేలు చేకూర్చుతుందని రైతులు తెలిపారు.

అనంతగిరిలో భారీ వర్షం...

అనంతగిరి: మండలంలోని సుమారు రెండుగంటల పా టుగా కురిసిన భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ ద్విచక్రవాహనదారులు నిలిచిపోయారు. జనజీవనం స్తంభించింది. గతం వారం రోజులుగా ఎండతీవ్రతతో ప్రజలంతా ఉక్కిరిబిక్కిరయ్యారు. శనివారం కురిసిన వర్షం తో ఉపశమనం పొందారు. పొలాల్లో నీటితో కళకళలాడాయి. రైతులు హర్షం వ్యక్తం చేశారు.



కొయ్యూరులో ఈదురుగాలులతో పడుతున్న వర్షం



చింతపల్లి సాయిబాబా ఆలయం వద్ద కూలిన విద్యుత్ స్తంభం

ప్రధాని మోదీ సుపరిపాలనపై విస్తృత ప్రచారం చేపట్టాలి

» బీజేపీ రాష్ట్ర సెల్ సహ ప్రభారి వేణుగోపాలం పిలుపు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలం

పాడేరురూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై బీజేపీ కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర సెల్ సహ ప్రభారి పైడి వేణుగోపాలం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మోదకొండమ్మ ఆడిటోరియంలో నరేంద్రమోదీ పాలనలో అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా త్రీమేన్ కమిటీ కన్వీనర్ పెనుమాక రవికుమార్ అధ్యక్షతన జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నాటికి ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన పూర్తవుతున్న నేపథ్యంలో వికసిత భారత్- 2047 అమృత కాలం దిశగా కేంద్ర ప్రభుత్వం కృషిని, అభివృద్ధిని ఈ నెల 9వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జూన్ 5వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు 60 రోజులు అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రతీ ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలన్నారు. జూన్ 23న శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ప్రతీ పోలింగ్ బూత్‌లో ఆయనను సంస్మరణ జరపాలన్నారు. నెల 21వ తేదీన విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగా డేను ప్రపంచ గిన్నీస్ రికార్డు సాధించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, నాయకులు పాంగి రాజారావు, నాయకులు సల్లా రామకృష్ణ, శెట్టి రాజు, స్వప్నకుమారి, సత్యవతి, కె.రాజారావు, రాస పాపిడిరాజు, కె.సుబ్రమణ్యం, కె.శ్రీనివాసరావు, దేవదాస్, వి.రామచంద్ర్, డి.ప్రభాకర్, కె.వెంకటరమణ, మంగతల్లి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి

» పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరావు

పాడేరురూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో అధికారులు చేపడుతున్న రోడ్ల విస్తరణ పనులకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే ఎం. విశ్వేశ్వరరాజు కోరారు. జిల్లా వ్యాప్తంగా రోడ్లు 100 అడుగుల మేర విస్తరణపై కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశాల మేరకు గత శనివారం 31వ తేదీన పాడేరులో ఈ పనులకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను తొలగించి పాడేరు మెయిన్ రోడ్డును 100 అడుగుల వరకు విస్తరిస్తామని ప్రకటించారన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆయన అనుచరులతో మెయిన్‌రోడ్డుకు ఎమ్మెల్యే చేరుకున్నారు. అయితే, బక్రీద్ సెలవు కావడంతో ఈ పనులను సోమవారానికి వాయిదా వేసినట్టు అధికారులు వివరించడంతో ఆయన వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాడేరు జిల్లా కేంద్రంగా మారిన తరువాత పట్టణంలో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అలాగే, రహదారుల విస్తరణకు హైకోర్టు ఆదేశాలను జారీ చేసిన నేపథ్యంలో పట్టణంలోని వ్యాపారులు సహకరించాలని సూచించారు. సోషల్ మీడియాలో వస్తున్న కథనాలపై మాట్లాడారు. తాను జిల్లాలోని ప్రతీ మండలంలో 100 అడుగులు రోడ్డు విస్తరణ పనులు జరగాలని ఆయన ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సీదరి.రాంబాబు, వనుగు బసవన్నదొర, మాజీ సర్పంచ్ మినుములు కన్నాపాత్రుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు, నగదు అందిస్తున్న ఆదివాసీ ఆర్మీ హెల్పింగ్ హేండ్స్ ట్రస్ట్ సభ్యులు, నాయకులు

పెదబయలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతగుంట పంచాయితీ రోగుల గ్రామానికి చెందిన వెచ్చంగి కమలమ్మ , విజయరాజు దంపతులకు నెల రోజుల క్రితం విశాఖ కేజీహెచ్‌లో ఒకే కాన్పులో ముగ్గురు ఆడ పిల్లలు జన్మించారు. వీరిది నిరుపేద కుటుంబం. తల్లికి పౌష్టికాహారం పెట్టలేని స్థితి. దీనిపై సీపీఎం నేత సన్నిబాబు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఈ విషయం తెలుసుకున్న విశాఖపట్నంలో పోలీసు శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న ఆదివాసీ ఆర్మీ హెల్పింగ్ హేండ్స్ ట్రస్ట్ వారు రూ. 10 వేల విలువ చేసే నిత్యావసర సామగ్రి, రూ. 5 వేలు స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు మాధవరావు, బొంజుబాబు చేతుల మీదుగా శనివారం ఆ కుటుంబానికి అందించారు. తమ ట్రస్ట్ తరపున అండగా ఉంటామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు రాము, చిన్నారావు, దాస్, కళ్యాణ్,మన్మధరావు, వైస్ సర్పంచ్ గంగాధరం, కొండయ్య, రాధాకృష్ణ, వినోద్, జగత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాడేరులో సీనియర్ సిటిజన్లకు యోగా

పాడేరురూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పాడేరులోని తలారిసింగి సీపీహెచ్ స్కూల్లో 8వ తేదీ సీనియర్ సిటిజన్లకు యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ ఆర్‌వీఎస్ రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్న ఈ యోగా శిక్షణకు సీనియర్ సిటిజన్లు హాజరయ్యేలా చూడాలని సచివాలయ ఉద్యోగులకు బాధ్యత అప్పగించామన్నారు. యోగాతో మానసిక శాంతి, ఆరోగ్యం చేకూరుతుందన్నారు.

టీడీపీ మండల కార్యవర్గం ఎంపిక

ముంచంగిపుట్టు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ మండల నేతలు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ పార్టీ నూతన మండల అధ్యక్షురాలిగా కిల్లో సన్యాసమ్మను ఇటీవల అరకు పార్టీ ఇన్‌చార్జి ప్రకటించారన్నారు. అలాగే, పార్టీ నేతల అభిప్రాయం మేరకునూతన మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎస్.శంకరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.బాబూజీరావు, ఉపకార్యదర్శిగా బి.రామారావు, కోశాధికారిగా ఆర్.కొండలరావు, ఉపకోశాధికారిగా ఉర్ధోబు, తెలుగు యువత అధ్యక్షులుగా వి.జగదీష్, ఉపాధ్యక్షులుగా ఎం.బీమన్న, తెలుగు రైతు అధ్యక్షులుగా కె.ఉర్ధోబు, ఉపాధ్యక్షులుగా జి.చందోర్, తెలుగు మహిళా అధ్యక్షులుగా కె.రత్నంను నియమించామన్నారు.

గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలి: ఎస్‌ఐ



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

అనంతగిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, రవాణా తదితర వాటికి సహకరించవద్దని స్థానిక ఎస్‌ఐ డి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఎగువశోభ పంచాయతీ దండబాడు గ్రామంలో శనివారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అలాగే గంజాయి సాగు చేస్తే చట్టరీత్యా నేరమని అన్నారు. అలాగే, వ్యవసాయ భూములను అమ్ముకోవద్దని, కుటుంబాలు రోడ్డునపడతాయని చెప్పారు. యువత ఉద్యోగాలపై దృష్టిపెట్టాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అం దిపుచ్చుకోవాలని కోరారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గిరి, గ్రామస్థులు నగేశ్, టీడీపీ నాయకుడు రంజీత్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ముంచంగిపుట్టు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో శనివారం ముస్లిం సోదరులు బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదులో మతపెద్దలు జాకీర్ హుస్సేన్, ఎండీ సోలెమాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొత్తబట్టలు ధరించారు. ముస్లిం సోదరులకు హిందువులు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ప్రత్యేక విందుకు ఆహ్వానించారు.



బక్రీద్ విశిష్టను వివరిస్తున్న ఇమామ్ షహీద్



జోలాపుట్టులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

చింతపల్లిలో ..

చింతపల్లి: మండలంలో ముస్లింలు బక్రీద్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం బక్రీద్‌ని పురస్కరించుకుని స్థానిక మసీదు క్యాబాలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. బక్రీద్ విశిష్టతను మత గురువు(ఇమామ్) షహీద్ వివరించారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈప్రత్యేక ప్రార్థనల్లో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా సాహేబ్, సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో ఉత్తమ ఫలితాలు

» జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి భీమశంకరరావు



వివరాలు వెల్లడిస్తున్న భీమశంకరరావు

పాడేరురూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పలు సంస్కరణల ఫలితంగా ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిచిలిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి సొంటేన భీమశంకరరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సప్లిమెంటరీ ఫలితాల్లో ఇంటర్ జనరల్ విభాగంలో ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లోనూ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ప్రథమ సంవత్సర జనరల్ కోర్సుల్లో 2,304 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1,751 మంది ఉత్తీర్ణులై, 76 శాతం సాధించామన్నారు. ద్వితీయ సంవత్సర జనరల్ కోర్సుల్లో 1,508 మందికి గాను 1,368 మంది ఉత్తీర్ణత సాధించి 91 శాతం నమోదు చేశారన్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలో ఒకేషనల్ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో 3వ స్థానం, ద్వితీయ సంవత్సరంలో 5వ స్థానంలో జిల్లా నిలిచాందన్నారు. జిల్లాలో గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 87.60 శాతం ఉత్తీర్ణత సాధించి 2వ స్థానంలో, ద్వితీ య సంవత్సరంలో 91.91 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ప్రభుత్వ కళాశాలలు ప్రథమ సంవత్సరంలో 74.28 శాతంతో 3వ స్థానంలో, ద్వితీయ సం వత్సరంలో 90.63 శాతంతో 2వ స్థానంలో నిలిచిందన్నారు. కేజీబీవీలు ప్రథమ సంవత్సరంలో 88.64 శాతంతో ప్రథమ స్థానం, ద్వితీయ సంవత్సరంలో 90.27 శాతంతో 3వ స్థానంలో నిలిచాయన్నారు. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా టాప్‌లో నిలవడానికి కృషి చేసిన అధికారులు, అధ్యాపకులకు ఆయన అభినందనలు తెలిపారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలి: ఏడీఆర్ శాస్త్రవేత్త



మాట్లాడుతున్న సాంకేతిక నిపుణుడు అప్పలరాజు, పక్కన ఏడీఆర్ అప్పలస్వామి

చింతపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ఖరీఫ్ సాగుకి సన్నద్ధ కావాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సచాలకులు (ఏడీఆర్) డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్టు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలతో కలిసి గిరిజన రైతులకు ఖరీఫ్ సాగుపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏడీఆర్ మాట్లాడుతూ గిరిజన రైతులు ప్రభుత్వం 90శాతం రాయితీపై పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట ఎరువులను నాటుకుని భూమిలో కలియదున్నుకోవాలన్నారు. దీనివల్ల సేంద్రియ సూక్ష్మపోషకాలు అందుతాయన్నారు. రైతులు మట్టి నమూనాలు తీసుకొస్తే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో భూసార పరీక్షలు చేస్తామన్నారు. భూసార పరీక్షలు ఆధారంగా నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. రైతులు మేలిజాతి వంగడాలను ఎంపిక చేసుకోవాలని కోరారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులు, నూతన సస్యరక్షణ చర్యలు పాటించడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. పంట సాగు విధానం, జాగ్రత్తలపై రైతులకు శిక్షణ అందిస్తున్నట్టు వివరించారు. వ్యవసాయ సాంకేతిక నిపుణులు డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ వరిని వరుసల పద్ధతిలో నాట్లు వేసుకోవాలన్నారు. దీని వల్ల వరికి గాలి, వెలుతురు బాగా తగిలి, దిగుబడులు రెట్టింపవుతాయన్నారు. కలుపును సులభంగా తొలగించుకోవచ్చునన్నారు. చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పాంగి సుబ్బారావు, వీఏఏ రాజశేఖర్ పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీ

అరకులోయ, జూన్ 7 ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ ఐటీఐల్లో ఈ విద్యా సంవత్సరానికి పలు ట్రేడుల్లో మిగిలిన సీట్లు భర్తీకి ఈ నెల 9, 10 తేదీల్లో అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు అరకులోయ ఆర్.ఐటీఐ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే మొదటి కౌన్సెలింగ్ ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నిర్వహించి, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలల్లో సీట్లు భర్తీ చేశామన్నారు. ఇంకా పలు ట్రేడ్‌ల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రభుత్వం అనుమతినిచ్చినందున 9, 10 తేదీలలో మరో మారు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొదట కౌన్సెలింగ్‌లో మిగిలిన పలు జనరల్ ట్రేడ్ సీట్లను భర్తీ చేస్తామన్నారు. అనంతరం ఐఎంసీ సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఐఎంసీ సీటు కోసం ఎస్టీ అభ్యర్థులు రూ.8వేలు, ఇతరులు రూ. 10 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలన్నారు. 9వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు 1 నుంచి 175 ర్యాంకుల గల అభ్యర్థులకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం వరకు 176 నుంచి 350 ర్యాంకుల అభ్యర్థులు హాజరుకావాలన్నారు. 10 న ఉదయం 9గంటలకు 351 నుంచి 523 ర్యాంకులు గలవారు, మధ్యాహ్నం 524 నుంచి 703 వరకు ఉన్న ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

రాయితీపై పీవీటీజీలకు వ్యవసాయ యంత్ర పరికరాలు



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

చింతపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పీవీటీజీలకు పీఎం ధర్తి ఆభ జంజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (పీఎండీఏజేజీయూఏ) పథకంలో భాగంగా 90శాతం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తున్నట్టు స్థానిక వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన బలపం, లోతుగెడ్డ గ్రామ పంచాయతీల్లో ఈ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీవీటీజీలు వ్యవసాయంలో పురోగతికి ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, విత్తనాలు, సూక్ష్మపోషక ఎరువులు, సోలార్ పంపులు, బింద్యు సేద్యం పరికరాలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. సమగ్ర సుస్థిర వ్యవసాయ అభివృద్ధికి గ్రామాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం నీటి యాజమాన్యం, తేనెటీగల పెంపకం, వర్మీ కంపోస్టు ఎరువుల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతర్ల సునీల్ , రైతులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు 14,757 దరఖాస్తులు



వ్యవసాయ అధికారి లకే పాత్రుడు

జి.మాడుగుల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నదాత సుఖీభవకు 14,757 మందిని అర్హులుగా గుర్తించినట్టు మండల వ్యవసాయాధికారి లకే పాత్రుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకానికి మం డలంలోని 19003 మంది రైతులు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. 14,757 దరఖాస్తులను అప్రూవ్ చేశామని, వివిధ కారణాల వల్ల 999 దరఖాస్తులను రెవెన్యూ అధికారులకు పంపించినట్టు ఆయన వివరించారు.


బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

నర్సీపట్నం/గొలుగొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గబ్బాడ గ్రామానికి చెందిన పెట్ల నారాయణమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అందజేశారు. నర్సీపట్నం క్యాంప్ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో స్పీకర్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు సీఎం సహాయ నిధి భరోసాగా ఉంటుందన్నారు. పది నెలల్లో ప్రభుత్వం 31 మందికి ఈ నిధి నుంచి సహాయం అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గబ్బాడ ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఈర్లి రాజబాబు, పంచాయతీ ఉప సర్పంచ్ ఎం.రాజునాయుడు, పార్టీ అధ్యక్షుడు అప్పలనాయుడు, నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు


మాకవరపాలెం: తామరం మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

మాకవరపాలెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో శనివారం బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు. మాకవరపాఎలం మండలంలోని తామరం మసీదుకు ముస్లింలు ఉదయాన్నే చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు బక్రీద్ విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బుచ్చెయ్యపేటలో...


వడ్డాదిలో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

బుచ్చెయ్యపేట: మండలంలో బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు. వడ్డాది జంక్షన్‌లోని మసీదు వద్ద ముస్లిం సోదరులు నమాజ్ చేశారు. ఇమామ్ షేక్‌నాజర్ అధ్వర్యంలో మహ్మద్ ప్రవక్తకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కూటమి నాయకులు శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, దొండా గిరిబాబు, సయ్యపురెడ్డి శ్రీనివాసు, వీర్ల సురేశ్, షేక్ రసూల్ తదితరులు మసీదుకు వెళ్లి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

మాడుగులలలో...

మాడుగుల: మండల కేంద్రంలో శనివారం ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జామియా మసీద్ చైర్మన్ షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో వేకువజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకు ముందు ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రావికమతంలో...


రావికమతం:కొత్తకోటలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రావికమతం: త్యాగానికి ప్రతీకగా ముస్లిం సమాజం జరుపుకునే బక్రీద్‌ను కొత్తకోట, రావికమతం మసీదుల్లో ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచే ముస్లింలు మసీదుకు చేరుకుని నమాజ్ చేశారు. మత గురువు మన్సూర్ ప్రవక్త ఇబ్రాహీం త్యాగాన్ని గుర్తుచేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందంగా గడిపారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


అభయాంజనేయస్వామి చిత్రపటాన్ని విడుదల చేస్తున్న బూడి, నాయకులు

చోడవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామజోగిపాలెం గ్రామంలో శనివారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు హాజరై, విగ్రహ ప్రతిష్ఠ పూజలో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పరవాడ ఎంపీపీ పైలా శ్రీనివాసరావు, నాయకుడు బూరె బాబూరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో పలు గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు


గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నాతవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండవసెంటర్‌లో నాలుగున్నర కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ సీహెచ్ భీమరాజు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా గుడివాడకు చెందిన మల్లిపూడి ఆసీస్‌తోపాటు మరో మైనర్ వ్యక్తి శనివారం నాలుగున్నర కిలోల గంజాయిని నర్సీపట్నం నుంచి బస్సులో తుని తీసుకువెళుతున్నారు. తాండవ సెంటర్‌లో పోలీసులు తనిఖీలు చేస్తున్నారని తెలుసుకొని డి.ఎర్రవరం వద్ద బస్సు దిగిపోయారు. వారు నడుచుకుంటూ వస్తుండగా పోలీసులు వారి బ్యాగును తనిఖీ చేయగా నాలుగున్నర కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ భీమరాజు తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.22 వేలు ఉంటుందన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుల నియామకం వాయిదా

పార్టీ పరిశీలకుల సమక్షంలో త్వరలో నియామకాల వెల్లడి

చోడవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షుల నియామకం మరోసారి చివరి నిమిషంలో వాయిదా పడింది. మహానాడుకు ముందే అధ్యక్ష నియామకాలపై కసరత్తు ప్రారంభమైనప్పటికీ, పేర్లను ఖరారు చేయలేదు. దీంతో పార్టీ అధ్యక్ష పదవుల ప్రకటన ప్రక్రియ వాయిదా పడింది.

చోడవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న అధ్యక్షులు బొడ్డేడ నాగగంగాధర్, గోకివాడ కోటేశ్వరరావు, రాజాన కొండనాయుడు, గుమ్మలూరి చంద్రమౌళిలను తిరిగి కొనసాగించాలని చాలా మంది నాయకులు సూచించారు. అయితే నిబంధనల ప్రకారం వీరంతా మూడు పర్యాయాలు అధ్యక్షులుగా కొనసాగినందున, మరలా కొనసాగించే అవకాశం లేకపోవడంతో అధి నేతలు ఏ నిర్ణయం తీసుకోలేదు. మహానాడు అనంతరం పార్టీ మండల అధ్యక్షుల విషయం ఖరారు చేద్దామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు స్పష్టం చేయడంతో ఈ వ్యవహారానికి బ్రేక్ పడింది.

తాజాగా చోడవరం మండల అధ్యక్షుడిగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, చోడవరం పట్టణ అధ్యక్షుడిగా ఎర్రంశెట్టి అప్పారావు, బుచ్చెయ్యపేట మండల అధ్యక్షుడిగా గోకివాడ భారతి, రావికమతం మండల అధ్యక్షురాలిగా జడ్పీటీసీ మాజీ సభ్యురాలు రాజాన శ్రీవాణి, రోలుగుంట మండలానికి అధ్యక్షుడిగా తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ నాగసూర్య చంద్రుడును నియమిస్తున్నట్టుగా శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే రాజు ప్రకటించారు.

మండల అధ్యక్షులు వీరే..?

నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షుల పేర్లు దాదాపు ఖరారయ్యాయి. చోడవరం మండల అధ్యక్షుడిగా పనిచేసిన నాగగంగాధర్ గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైనందున, అతని స్థానంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు పేరు ఖరారు చేశారు. పట్టణ అధ్యక్షుడిగా మూడుసార్లు పూర్తి చేసిన దేవరపల్లి వెంకట అప్పారావు స్థానంలో ఎర్రంశెట్టి అప్పారావు (చిన్న) పేరు ఓకే చేశారు. బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు మాత్రం ఇప్పటి వరకూ మూడు పర్యాయాలు అధ్యక్షులుగా పనిచేసిన గోకివాడ కోటేశ్వరరావు స్థానంలో అతని భార్య భారతికి, రాజానకొండం నాయుడు స్థానంలో ఆయన సతీమణి రాజాన శ్రీవాణికి అవకాశం కల్పించారు. రోలుగుంట మండలానికి గుమ్మలూరి చంద్రమౌళి స్థానంలో పంచాడ నాగసూర్య చంద్రుడు పేర్లను ఖరారు చేశారు. ఐదు పేర్లను ప్రకటిస్తూ శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే రాజు ఉత్తర్వులు కూడా ఇచ్చారు. అయితే చివరి నిమిషంలో ఈ పేర్లను ప్రకటించే విషయంలో పార్టీ అధి నేతల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నియామక ప్రక్రియను మరోసారి వాయిదా వేశారు.

పరిశీలకుల సమక్షంలోనే..

పార్టీ నాయకులు పరిశీలకుల సమక్షంలో మండల పార్టీ అధ్యక్షుల పేర్లు ఖరారు చేసే అవకాశం ఉందని సమాచారం. నియోజకవర్గాల వారీగా పార్టీ కొత్త పరిశీలకులను నియమిస్తుందని పార్టీ నాయకులు అంటున్నారు. పార్టీ పరిశీలకులు మరోసారి మండలాల వారీగా స్థానిక నేతలతో సమావేశమై, వారి సమక్షంలో అధ్యక్షుల పేర్లను వెల్లడిస్తారని తెలిసింది. దీంతో మహానాడుకు ముందు పూర్తికావాల్సిన అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ, మహానాడు పూర్తయినా వాయిదాల పర్వం కొనసాగుతుండడంపై పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

మోస్తరు వర్షం


మాకవరపాలెంలో హోరున కురుస్తున్న వర్షం

మాకవరపాలెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో శనివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి ఎంత తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అయితే మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. 3 గంటల సమయంలో చల్లబడి మోస్తరు వర్షం కురిసింది. గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రతకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో కురిసిన ఈ వర్షానికి అంతా ఉపశమనం పొందారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వర్షం పడింది. ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట తదితర గ్రామాల్లో ఉదయం నుంచి ఎండతో అల్లాడిన ప్రజలకు, మధ్యాహ్నం కురిసిన వాన ఊరటనిచ్చింది. వర్షంతో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ఏఎల్‌పురం గ్రామంలో మురుగునీరు రోడ్డుపై పారింది. కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షాలు ఖరీఫ్ సాగుకు దోహదపడతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

రావికమతంలో...

రావికమతం: ఉదయం నుంచి భగభగమంటూ ఉక్కిరిబిక్కిరైన మండల వాసులకు శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షం ఉపశమనం కల్పించింది. ఓ పక్క ఉదయం నుంచి నిప్పుల కొలిమిలా ఎండ కాసింది. ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు భారీ వర్షం ఉపశమనం కల్పించింది. తీవ్రమైన ఎండలతో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో గాలి లేక ఎండ వేడికి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణం చల్లబడిపోయి ఈదురగాలులతో భారీ వర్షం కురవడంతో ప్రజలు సేద తీరారు.

మాడుగులలలో...

మాడుగుల: మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షపు జల్లులు పడ్డాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండ అధికంగా ఉంది. అనంతరం ఒక్కసారిగా వాతావరణంలో మారిపోయింది. చల్లని వాతావరణం ఏర్పడింది. అదే సమయంలో కొంతమేర తేలికపాటి వర్షం జల్లులు కూడా పడ్డాయి.

గుమ్మిడిగొండలో ప్రత్యేక వైద్య శిబిరం

ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితుల గుర్తింపు.. 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


వైద్య శిబిరం రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

నాతవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిడిగొండ గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితులను గుర్తించారు. 'గుమ్మిడిగొండలో వైరల్ జ్వరాలు' అనే శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి గునుపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు స్పందించారు. ఈ మేరకు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వర బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. బాధితులకు అవసరమైన మందులను అందజేశారు. అనంతరం డాక్టర్ ఎం.చక్రధర్ బల్లీ, ఆరోగ్య విస్తరణాధికారి చింతకాయల నాగేశ్వరరావు, పీహెచ్ఎన్‌వో వెంకటలక్ష్మీ సిబ్బందితో కలిసి ఇంటింటికీ స్వయంగా వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించారు. వారికి కూడా అక్కడే పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 90 మందికి రక్త పరీక్షలు చేసి మందులు అందించినట్టు డాక్టర్ చక్రధర్ తెలిపారు. అలాగే పంచాయతీ కార్యదర్శి శేమ వీధులలో బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి ట్యాంకులను పరిశుభ్రం చేయించారు. వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు వస్తున్నాయని, కాచి ఒడబోసిన నీటిని మత్రమే తాగాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా డాక్టర్ చక్రధర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్యాంసన్, గంగ, స్థానిక నాయకుడు సుర్ల అచ్చియ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా

విస్తృతంగా వాహనాల తనిఖీలు: రూరల్ సీఐ రేవతమ్మ


భీమవరం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న సీఐ రేవతమ్మ, ఎస్ఐ తారకేశ్వరరావు

కృష్ణాదేవిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గంజాయి, సారా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టామని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. శనివారం సాయంత్రం ఏజెన్సీ ముఖ ద్వారమైన భీమవరం పోలీసు చెక్‌పోస్టు, పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట, బంగారంపేట-అంతాడ రహదారి, తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా ఎగరవేసి గంజాయి, అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకట్ట వేసేందుకు నిఘా పెట్టారు. అలాగే వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ రేవతమ్మ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో గంజాయి, సారా, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఇందులో భాగంగా అనుమానిత గ్రామాల్లో డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టడటంతో పాటు వాహన తనిఖీలు చేస్తున్నామన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని, అసాంఘిక కార్యకలాపాలపై తమకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వై.తారకేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాకపల్లిలో పరదేశమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ


ఆలయ నిర్మాణానికి పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

దేవరాపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకపల్లి గ్రామంలో పరదేశమ్మ ఆలయ నిర్మాణానికి శనివారం గ్రామస్థులు భూమి పూజ చేశారు. పురోహితులు పాకల కామేశ్వరరావుశర్మ ఆధ్వర్యంలో పలువురు దంపతులతో పూజలు చేయించారు.

'రేషన్‌కు బదులు నగదు వద్దు'

దేవరాపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్‌కు బదులు నగదు బదిలీ ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వం రేషన్‌కు నగదు ఇచ్చే ఆలోచన సరికాదని, వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ

మాకవరపాలెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు వీల్ చైర్లతో పాటు పలు సామగ్రిని బీజేపీ మండల అధ్యక్షుడు మర్రి నాయుడు అందజేశారు. మండల కేంద్రమైన మాకవరపాలెంలో శనివారం దివ్యాంగులు, వయో వృద్ధుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను అన్ని విధాగా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుదన్నారు. అలాగే రాబోయే రోజుల్లో దివ్యాంగులకు అంత్యోదయ కార్డుల మంజూరుకు తమవంతు కృషి చేస్తానన్నారు. దీనిపై జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. అనంతరం తన ఖర్చులతో ముగ్గురు దివ్యాంగులకు వీల్ చైర్లును, మరికొంత మందికి పలు రకాలైన వినుకుడు సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు సతీశ్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రుత్తల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు చైర్లు అందిస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు

ఎట్టకేలకు ఎరకన్నపాలెంలో ఉపాధి పనులు ప్రారంభం

మాకవరపాలెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎరకన్నపాలెం గ్రామంలో ఎట్టకేలకు ఉపాధి పథకం పనులను శనివారం ప్రారంభించారు. పనులు కల్పించడం లేదని శుక్రవారం కూలీలు నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఏపీవో కాశీ స్పందించి జాబ్ కార్డు ఉన్న వారికి పనులను కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ పనులు కల్పిస్తామని చెప్పారు. పనులు చేయకుండా మస్తర్లు వేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. గ్రామంలో జాబ్ కార్డు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఉపాధి సిబ్బంది ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అన్ని సమయాల్లో అండగా ఉంటానని డిప్యూటీ మాజీ సీఎం బూడి ముత్యాలనాయుడు పేర్కొన్నారు. మండలంలోని తామరబ్బ గ్రామంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కడారి రాజు తల్లి అర్జునమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని, శనివారం ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ అధైర్య పడవద్దని, అండగా ఉంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, తామరబ్బ సర్పంచ్ రామకృష్ణ, నాయకులు మహేశ్, రాజు పాల్గొన్నారు.

వృద్ధుల చెంతకే రేషన్ సరకులు

రోలుగుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. బుచ్చెంపేట గ్రామంలో శనివారం వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు రేషన్ డీలర్లు వెళ్లి సరకులు అందించారు. ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎండీయూ వాహనాలతో ఇంటింటికీ కాకుండా వీధి శివారున పంపిణీ చేసే వారని, దీంతో ఇబ్బందులు పడేవారమని లబ్ధిదారులు పేర్కొన్నారు.

సచివాలయాల్లో ఆన్‌లైన్ సేవలు బంద్

మాడుగుల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో సాంకేతిక లోపాల కారణంగా మూడు రోజుల పాటు ఆన్‌లైన్ సేవలు నిలిపివేస్తున్నట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. శనివారం నుంచి మంగళవారం రాత్రి వరకు ఈ సేవలు అందుబాటులో ఉండవని చెప్పారు. ఆదాయ, సమగ్ర ధ్రువీకరణ, భూమి మ్యూటేషన్, రేషన్ కార్డు, ఇళ్ల స్థలాలు, వృద్ధాప్య ధ్రువీకరణ, వివాహ, రెవెన్యూ, నీటి పన్ను తదితర సేవలు నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. మిగిలిన ప్రభుత్వ సేవలన్నీ మీసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు.

12న అప్పికొండమ్మ జాతర



కృష్ణాదేవిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట కనకదుర్గమ్మ ఆలయం పక్కన వెలసిన గ్రామదేవత అప్పికొండమ్మ జాతరను ఈ నెల 12న జరగనుంది. విద్యుత్ అలంకరణతో ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఈ జాతరకు కొయ్యూరు, గొలుగొండ, నాతవరం, నర్సీపట్నం తదితర మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు టెంటలు, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు.

కుక్కల దాడిలో ఐదు మేకల మృతి

బుచ్చెయ్యపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామంలో శనివారం కుక్కలు దాడి చేయడంతో కురందాసు నాయుడుకు చెందిన ఐదు మేకలు మృతి చెందాయి. కురందాసు నాయుడు ఎప్పటిలాగే పొలంలో మేత ముగించి పాకలో మేకలను ఉంచాడు. తెల్లవారు చూసేసరికి గాయాలతో మృతి చెంది ఉన్నాయని బాధితుడు వాపోయాడు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను నివారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

చీడికాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మంచాల మోడల్ స్కూల్, ఖండివరం జడ్పీహెచ్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. మోడల్ స్కూల్ నుంచి రొంగలి ప్రశాంతి, గెంజి రేష్మశ్రీ, పట్నాల వంశీ, బొబ్బిలి లోకేశ్, ఖండివరం జడ్పీహెచ్ పాఠశాల నుంచి జి.గగనకోటి, టి.భార్గవి అర్హత సాధించారని ఆయా పాఠశాలల హెచ్ఎంలు సిహెచ్.వెంకటలక్ష్మి, చిరంజీవి ఆచార్యులు శనివారం తెలిపారు. వీరికి ప్రతి ఏటా ప్రభుత్వం రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం ఇస్తుందన్నారు.

ప్రాణాంతకం ట్యూమర్లు



ఉత్తరాంధ్రలో బ్రెయిన్ ట్యూమర్ కేసులు నానాటికీ అధికమవుతున్నాయి. గత పదేళ్లలో ఈ కేసులు మూడు రెట్లు పెరిగినట్టు నిపుణులు విశ్లేషిస్తున్నారు. బ్రెయిన్ ట్యూమర్లు బారినపడడానికి ప్రధానంగా జన్యుపరమైన అంశాలు, రేడియేషన్ కారణమవుతున్నట్టు చెబుతున్నారు. బ్రెయిన్ ట్యూమర్స్ అనేవి పదుల రకాల్లో ఉన్నప్పటికీ... వీటిలో కొన్ని రకాలు ప్రాణాంతకంగా మారుతున్నట్టు వైద్య నిపుణులు భావిస్తున్నారు. ఆదివారం అంతర్జాతీయ బ్రెయిన్ ట్యూమర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

- పదేళ్లలో భారీగా నమోదవుతున్న ఈ తరహా కేసులు
- ఉత్తరాంధ్రలో ఏటా 1,500కు పైగా నమోదు
- వీటిలో ఎక్కువగా మెడిలో బ్లాస్టమో, గ్లయోమా, గ్లయోబాస్కమో..

ఉత్తరాంధ్రలో నానాటికీ అధిమవుతున్న బ్రెయిన్ ట్యూమర్ బాధితులు

- ఎంఆర్ఐ, సిటీ స్కాన్లతో సకాలంలో టూమ్మర్ల గుర్తింపునకు అవకాశం
- బయాప్సీతో క్యాన్సర్ కారక, రహిత ట్యూమర్స్‌గా నిర్ధారణ

నేడు అంతర్జాతీయ బ్రెయిన్ ట్యూమర్స్ డే

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

మెదడులో పాత కణజాలం పోయి కొత్త కణజాలం సృష్టి నిరంతరాయంగా జరుగుతుంటుంది. ఈ ప్రక్రియలో పాత కణజాలాలు పూర్తిగా నమసిపోకుండా మిగిలిపోతే ట్యూమర్ (కణితి)గా ఏర్పడే ప్రమాదముంది. ఈ ట్యూమర్ వల్ల ఏదైనా భాగం దెబ్బతింటే అక్కడ పనితీరు మందగిస్తుంది. బ్రెయిన్‌లో కణితి ఉంటే మాత్రం ప్రమాదకరంగా భావించాలి. కణితులు రెండు రకాలు. బ్రెయిన్‌లో మొదలై బ్రెయిన్‌లోనే వచ్చేవి ఒకటైతే, శరీరంలోని ఇతర భాగాల్లో క్యాన్సర్లు ఉండి వాటి ప్రభావం వల్ల బ్రెయిన్‌లో ఏర్పడే కణితులు రెండో రకం. బ్రెయిన్‌లో వచ్చే కణితులు మళ్లీ రెండు రకాలు. క్యాన్సర్ కారక కణితులు, క్యాన్సర్ రహిత కణితులు. బ్రెయిన్‌లో ఎటువంటి కణితి ఉన్నా ప్రమాదకరంగా భావించాలి. బ్రెయిన్ ట్యూమర్లలో వందకు పైగా రకాలున్నాయి. ఇవన్నీ రోగికి హాని కలిగించేవి. లక్ష మందిలో ఒకరు బ్రెయిన్ ట్యూమర్స్ బారినపడుతున్నారు. ప్రతి ఇద్దరు ట్యూమర్ బాధితుల్లో ఒకరు అత్యంత ప్రమాదకరమైన మెడిలో బ్లాస్టమో, గ్లయోమా/గ్లయో బ్లాస్టామో అనే క్యాన్సర్ కారక ట్యూమర్స్ బారినపడుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. చిన్నారుల్లో ఎక్కువగా మెడిలో బ్లాస్టమో కనిపిస్తుండగా, పెద్దలు గ్లయోమా/గ్లయో బ్లాస్టామో బారినపడుతున్నారు.

ప్రాణాల మీదకు..

సాధారణంగా బ్రెయిన్ ట్యూమర్స్ లక్షణాలను గుర్తించలేకే అధిక శాతం మంది ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. కొన్ని లక్షణాల ద్వారా వీటిని సకాలంలో గుర్తించేందుకు అవకాశముంది. ఫిట్స్, వాంతులు, వాతం, కంటిచూపు మందగించడం, ఒకటి రెండుగా కనిపించడం, వినికిడి తగ్గడం, విపరీతమైన తలనొప్పి, బిహేవియర్‌లో తేడాలు, జ్ఞాపక శక్తిని కోల్పోవడం, మింగడంలో ఇబ్బందులు వంటి లక్షణాలను బట్టి బ్రెయిన్ ట్యూమర్స్‌గా అనుమానించాలి. శరీరంలో ఒక భాగం మొద్దుబారినట్టు ఉండడం, ముఖం కండరాలు పక్కకు లాగినట్టు ఉండడం, ఒక భాగంలో తిమ్మిర్లు, వణుకుడు లక్షణాలుంటే వైద్యులను సంప్రదించి ఎంఆర్ఐ, సీటీ స్కాన్ చేయించుకోవడం ద్వారా ట్యూమర్స్‌ను గుర్తించి, వైద్యం పొందడం ద్వారా కోలుకునేందుకు అవకాశముందని వైద్యులు పేర్కొంటున్నారు. మహిళల్లో అయితే రొమ్ముల నుంచి పాలు కారడం, పీరియడ్స్ ఆగిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయంటున్నారు.

ప్రమాదకరంగా క్యాన్సర్ కణితులు..

సాధారణ కణితులు అయితే సర్జరీ చేసి తొలగిస్తారు. క్యాన్సర్ కణితులైతే మాత్రం ఇబ్బందే. క్యాన్సర్ కణితులను నాలుగు దశలుగా పేర్కొనవచ్చు. మొదటి రెండు దశల్లో పెద్ద ఇబ్బంది ఉండదు. మూడు, నాలుగు దశల్లో ఉంటే ఆపరేషన్ అనంతరం రేడియోథెరపీ, కీమోథెరపీ చేయాలి. నాలుగో దశలో గుర్తిస్తే వారి జీవితకాలం రెండేళ్లకు మించి ఉండదు. మళ్లీ బ్రెయిన్ ట్యూమర్స్ వచ్చేందుకు అవకాశముంది. ట్యూమర్లు వయసుతో సంబంధం లేకుండా ఎవరిలోనైనా రావచ్చు. 20 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వారిలో ఎక్కువగా కనిపిస్తాయి. మెడిలో బ్లాస్టమో అనే ట్యూమర్స్ మాత్రం పదేళ్ల వయసు చిన్నారులలోన్యూ కనిపిస్తుంటాయి. జీన్ మ్యూటేషన్ కనిపిస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు.

ఏటా 1,500 కేసులు..

ఉత్తరాంధ్రలో కొన్నేళ్లుగా బ్రెయిన్ ట్యూమర్ బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్టు నిపుణులు పేర్కొంటున్నారు. ఏటా 1,500 వరకు కేసులు కొత్తగా నమోదవుతుండగా, వీటిలో 600 క్యాన్సర్ కారక ట్యూమర్లుంటున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. సాధారణంగా శరీరంలోని ఇతర భాగాలకు వచ్చే క్యాన్సర్లు బ్రెయిన్‌కు సోకేందుకు అవకాశముంది. అయితే బ్రెయిన్ క్యాన్సర్లు మాత్రం మిగిలిన చోట్లకు పాకే అవకాశం లేదు. కణితులను బయాప్సీ ద్వారా పరీక్షించి సాధారణమైనవా?, క్యాన్సర్‌కు సంబంధించి నవా? అనేది నిర్ధారిస్తారు. క్యాన్సర్ కణితుల దశను బట్టి కీమో, రేడియోథెరపీలను అందిస్తారు. జన్యు లోపాలు, అధిక రేడియేషన్ వల్ల కొందరిలో కణితులు వస్తున్నాయి.

బ్రెయిన్ ట్యూమర్‌పై భయాలొద్దు



ప్రస్తుతం కేజీహెచ్ న్యూరో సర్జరీ విభాగానికి వస్తున్న కేసులలో 30 శాతం బ్రెయిన్ ట్యూమర్‌కి సంబంధించిన వే ఉంటున్నాయి. సంవత్సరానికి సుమారు 700 కేసుల వరకు చికిత్స అందిస్తున్నాం. చిన్నాపెద్దా తేడా లేదు. అందరికీ వస్తున్నాయి. రోగికి పగటి సమయంలో తలనొప్పి రెగ్యులర్‌గా వస్తే వైద్యుని సంప్రదించి సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌ల ద్వారా నిర్ధారణ చేసుకోవాలి. ముందుగా సమస్యను గుర్తించి తగిన చికిత్స అందిస్తే 90 శాతం రికవరీ అవుతున్నారు. అలాంటివారు సాధారణ జీవితం గడపవచ్చు. క్యాన్సర్ సంబంధిత ట్యూమర్‌లను ముందుగా గుర్తించలేక పోవటం వల్ల కేవలం 5 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. బ్రెయిన్ ట్యూమర్ చికిత్సకు కేజీహెచ్‌లో మెరుగైన వైద్యవసతులు ఉన్నాయి. అందువల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో బ్రెయిన్ ట్యూమర్‌పై ఆందోళన అవసరం లేదు. -డాక్టర్ ఎం.ప్రేమ్‌జిత్ రే, కేజీహెచ్ న్యూరో సర్జరీ విభాగాధిపతి

నేటి నుంచి అంధ మహిళల క్రికెట్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్స్/ఉక్కుటౌన్‌షిప్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ సింహాద్రి సహకారంతో క్రికెట్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్ ఆంధ్రప్రదేశ్, కేరళ సంయుక్తంగా నిర్వహించనున్న అంధ మహిళల క్రికెట్ టోర్నీ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. స్టీల్‌ప్లాంట్ పరిధిలోని ఉక్కు స్టేడియం వేదికగా ఐదు రోజులు జరగనున్న ఈ టోర్నీలో ఆతిథ్య ఆంధ్ర, కేరళతోపాటు ఢిల్లీ, ఒడిశా జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. లీగ్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీ తొలి మ్యాచ్ ఉదయం 8 గంటలకు ఆంధ్ర-కేరళ, రెండో మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు ఒడిశా-ఢిల్లీ జట్లు తలపడతాయన్నారు.

విజన్ యాక్షన్ యూనిట్ల ప్రారంభానికి చర్యలు

... 5వ పేజీ తరువాయి

కేటాయించిన సిబ్బంది వెంటనే రిపోర్టు చేయాలని ఆమె ఆదేశించారు. జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న విజన్ యాక్షన్ యూనిట్‌ల కార్యకలాపాలను సోమవారం నుంచి పూర్తిస్థాయిలో కొనసాగించాలన్నారు. యూనిట్ ఏర్పాటుకు కావాల్సిన వసతి, ఫర్నిచర్, కంప్యూటర్లు సమకూర్చాలని సంబంధిత మండల అభివృద్ధి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రణాళికాధికారి జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పల్లా సింహాచలం మృతి పట్ల పలువురి దిగ్భ్రాంతి

అనకాపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి పట్ల జిల్లా టీడీపీ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖపట్నం సీతమ్మపేటలో పల్లా సింహాచలం భౌతికకాయాన్ని శనివారం జిల్లాకు చెందిన పలువురు టీడీపీ నేతలు సందర్శించి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలా జీలు పూలమాలు వేసి నివాళులర్పించారు.



పల్లా సింహాచలం పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేషన్ల ఛైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, పీలా గోవింద సత్యనారాయణ, పీవీజీ కుమార్, తదితరులు

స్పీకర్ సంతాపం

నర్సీపట్నం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తండ్రి మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు సంతాపం వ్యక్తం చేశారు. 1989 నుంచి ఆయన పార్టీకి విశేషమైన సేవలు అందించారని. 1994లో విశాఖపట్నం-2 ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు సేవలు అందించారన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.





సింహాచలం కుమారుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్‌బాబు

వీడని చెత్త డంపింగ్ యార్డు కష్టాలు

... 5వ పేజీ తరువాయి

సిబ్బంది పోస్తూ వస్తున్నారు. ఐటీ కాలనీ సమీపంలోని శ్మశాన వాటికలో ఉన్న చెత్త డంపింగ్ యార్డులోనే ఎక్కువ శాతం చెత్త పోగుపడుతుండడం స్థానికులను అసహనానికి గురిచేస్తున్నది. గతంలో ఈ చెత్త డంపింగ్ యార్డు తొలగించాలంటూ స్థానికులు ఆందోళనలు చేయడంతో చెత్త డంపింగ్ యార్డు కోసం అధికారులు పలు ప్రదేశాలను గుర్తించారు. అయితే తమ పంచాయతీల పరిధిలో చెత్త డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించవద్దంటూ ఆయా పంచాయతీల నేతలు అధికారులపై తీవ్ర ఒత్తిడి చేయడంతో ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఇటీవల కాలంలో ఐటీ కాలనీ సమీపంలో చెత్త ఎక్కువగా పోగుపడడం, డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను కాలుస్తుండడంతో విపరీతమైన పొగ పరిసర కాలనీలోని నివాసాలను చుట్టుముడుతున్నది. దీంతో వారంతా మరోసారి ఈ డంపింగ్ యార్డు పరిస్థితిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. నివాసాల మధ్యన ఉన్న ఈ డంపింగ్ యార్డులో చెత్త కాల్చడం వల్ల తమ ఆరోగ్యాలు చెడిపోతున్నాయని, దీనిని వేరే ప్రాంతానికి తరలించాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఈ డంపింగ్ యార్డు సమస్య మరోసారి తెర మీదకు వచ్చింది. స్థానికుల డిమాండ్ల నేపథ్యంలో మరోసారి అధికారులు చెత్త డంపింగ్ యార్డుకు అవసరమైన స్థలం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

స్థలం కోసం ప్రయత్నిస్తున్నాం

- కె.నారాయణరావు, చోడవరం పంచాయతీ ఈవో

పట్టణానికి అవసరమైన చెత్త డంపింగ్ యార్డుకు సరిపడా స్థలం లేక ఇబ్బందులు పడుతున్నాం. చెత్త ఎక్కడ పోయాలన్నది కూడా ఇబ్బందికరంగా మారింది. ఈ స్థలం సమస్య స్థానిక ఎమ్మెల్యే దృష్టిలో ఉంది. డంపింగ్ యార్డుకు అవసరమైన స్థలం ఇవ్వడానికి మండలంలోని పంచాయతీల పరిధిలో ఎవరూ ముందుకు రావడం లేదు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా చెత్త డంపింగ్ యార్డుకు అవసరమైన స్థలాన్ని గుర్తించే ప్రయత్నంలో ఉన్నాం. స్థలం దొరికితే డంపింగ్ యార్డు సమస్య తీరే అవకాశం ఉంది.

సింహగిరి కిటకిట

- అప్పన్న స్వామిని దర్శించేందుకు తరలివచ్చిన భక్తజనం
- ఒక్క రోజులో దేవస్థానం ఖజానాకు రూ.50 లక్షల ఆదాయం



ఆలయంలో భక్తుల రద్దీ

సింహాచలం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి శనివారం తరలివచ్చిన భక్తులతో సింహగిరి కిటకిటలాడింది. చందన యాత్రను తలపించేలా సింహగిరి అంతటా భక్తులు, వారి రాకపోకలకు వినియోగించిన ద్విచక్ర వాహనాలు, కార్లతో పార్కింగ్ ప్రాంతాలన్నీ నిండిపోయాయి. ఒక దశలో కార్ల పార్కింగ్ సుమారు కిలోమీటరు దూరాన గల సింహగిరి హిల్‌టాప్ రోడ్డుకు చేరింది. భక్తుల రద్దీని గమనించిన దేవస్థానం ఈవో వేండ్ర త్రినాథరావు ప్రధాన రాజగోపురం వద్ద గల క్యాంపు కార్యాలయంలో కూర్చుని కేశఖండనశాల, ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద, దర్శనాల క్యూలలో భక్తుల రద్దీ నియంత్రణకు ఎప్పటికప్పుడు తగిన సూచనలను అధికారులకు ఇచ్చారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు తాగునీరు, చిన్నారులకు పాలు, బిస్కెట్లు పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టారు. భక్తజనం అధిక సంఖ్యలో రావడంతో దేవస్థానం ఖజానాకు శనివారం ఒక్కరోజే సుమారు రూ.50,93,115 లక్షల ఆదాయం సమకూరినట్టు గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఆదాయంలో సింహభాగం శ్రీఘ్రదర్శనం రూ.100, అతి శ్రీఘ్రదర్శనం రూ.300 టికెట్ల విక్రయాల ద్వారా రూ. 28,64,200 సమకూరగా, రూ.15 లడ్డూ ప్రసాదం, రూ.10 పులిహోర ప్రసాదాల అమ్మకాల ద్వారా రూ.13,72,960 ఆదాయం లభించింది. ప్రసాదాలు, దర్శనాల టికెట్లతోపాటు భక్తులు సమర్పించిన తలనీలాల టికెట్లు రూ.40 విక్రయాల ద్వారా రూ.3,98,960, విరాళాల రూపంలో రూ.2,25,008, నిత్య కల్యాణం, స్వర్ణతులసీ దళార్చన వంటి ఆర్జిత సేవల టికెట్ల అమ్మకాల ద్వారా రూ.94,480, వసతి, రవాణా విభాగాలతో కలిపి మొత్తం రూ.50,93,115 ఆదాయం సమకూరింది.

క్రైం... crime news

రైలు ఢీకొని నక్కపల్లివాసి మృతి



రెడ్డి సాయిమోహన్(ఫైల్)

పాయకరావుపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో నర్సీపట్నం రోడ్డు, గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్య శనివారం ఉదయం గుర్తు తెలియని రైలు ఢీకొని నక్కపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి పి.వాసు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం నర్సీపట్నం రోడ్డు, గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్య విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న గుర్తుతెలియని రైలు ఢీకొని నక్కపల్లి మండలం న్యాయంపూడి గ్రామానికి చెందిన రెడ్డి సాయిమోహన్(30) మృతి చెందాడు. అతను నక్కపల్లి మండలంలోని హెటిరో మందుల కంపెనీలో సేఫ్టీ ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడని, అతనికి ఆరు నెలల క్రితం వివాహమైందని, భార్య, తల్లిదండ్రులు ఉన్నారని రైల్వే పోలీసులు తెలిపారు. అతను తన సమీప బంధువు కలం చిన్నబ్బాయిని కలిసేందుకు మండలంలోని సీతంపాలెం గ్రామానికి వెళ్లే రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందినట్టు తెలిసిందన్నారు. దీనిపై తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ హెచ్‌సీ జి.మోహనరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి (ఫైల్ ఫొటో)

ఎలమంచిలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరాపల్లి హైవే తండాల దిబ్బ ఎదురుగా ఉన్న జంపపాలెం రోడ్డులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు స్థానికులు శనివారం గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ వ్యక్తి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని, వీఆర్వో పి.గంగబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తి మూడు రోజులుగా హైవే వెంబడి చొక్కా లేకుండా తిరుగుతుండేవాడని, అతనికి మతిస్థిమితం లేదని, రెండు రోజులు క్రితం గ్రామస్థులు అతని ఫొటో తీశారని పోలీసులు చెప్పారు. భోజనం సరిగా లేకపోవడం, ఎండలకు బాగా నీరసించి మృతి చెంది ఉండవచ్చునని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీసులను 9440796104, 9440796079 ఫోన్ నంబర్లలో సంప్రతించాలని కోరారు.

ఫైనాన్షియర్ ఒత్తిడి తట్టుకోలేక డ్రైవర్ ఆత్మహత్య



లోవరాజు (ఫైల్)

పెదబయలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బైక్ ఫైనాన్షియర్ ఒత్తిడి తట్టుకోలేక వ్యాన్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీతగుంట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామానికి చెందిన గూబరి లోవరాజు (23) టిప్పర్ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల మూడో తేదీన బయటకు వెళ్లిన లోవరాజు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య సరోజిని, కుటుంబ సభ్యులు వెతికారు. అయినా ఆచూకీ దొరకలేదు. అయితే శనివారం మధ్యాహ్నం సీకరి పంచాయతీ పులుసుమామిడి గ్రామ సమీపంలోని కొండపై ఓ చెట్టుకు యువకుడు ఉరివేసుకుని, మృతిచెంది ఉండడంపై స్థానికులు, ప్రజాప్రతినిధుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. ఈ విషయం తెలియడంతో లోవరాజు భార్య సరోజిని వెళ్లి మృతదేహాన్ని చూసి తన భర్తే అని గుర్తుపట్టింది. గూబరి లోవరాజు పేరు మీద అతని స్నేహితుడు అనిల్‌కుమార్ మూడు నెలల క్రితం 220 పల్సర్ బైక్‌కు కొనుగోలు చేశారు. ఇటీవలే ఓ కేసులో అనిల్‌కుమార్ ద్విచక్రవాహనంతో పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో బైక్ లోవరాజు మీద ఉండడంతో ఫైనాన్షియర్లు తరచూ లోవరాజుకు ఫోన్ చేసి, వాయిదాలు కట్టాలని ఒత్తిడి చేసేవారు. దీంతో మనస్తాపానికి గురైన లోవరాజు ఈనెల మూడో తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. పోసుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రూ.లక్ష కోట్ల పెట్టుబడులు కూటమి ప్రభుత్వ ఘనతే

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి ఏడాది కాలంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పరిపాలన పూర్తయిన సందర్భంగా అనకాపల్లి పట్టణ టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్రతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఏడాది కాలంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ కృషితో విశాఖకు గూగుల్ కంపెనీ వచ్చిందన్నారు. విశాఖ దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కి జీఎంను నియమించడంతో పనులు వేగవంతమయ్యాయని పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ నేతలు ఎస్.గణేశ్, టీడీపీ మండలాధ్యక్షుడు కర్రి బాబి, త్రినాథ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తాండవం

... 5వ పేజీ తరువాయి

వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరందించే తాండవ నదిలో వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి భూగర్భ జలాలు కలుషితమవుతున్నా పట్టించుకున్నవారే లేరని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నదిలో చెత్త వేయకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవడంతో పాటు జలాలు కలుషితం కాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539